




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 సంచిక : 203 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 3 మార్చి 2025 పేజీలు : 12 వెల : 2/-





# వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఓకే

- అనుకూలంగా 226 ఓట్లు.. వ్యతిరేకంగా 163... ప్రతీ సవరణ మీద ఓటింగ్‌కు పట్టుబడిన విపక్షాలు
- అర్ధరాత్రి దాటాక అన్ని సవరణలపై ఓటింగ్‌తో ఆమోదం... వక్ఫ్ బిల్లు పేరును 'ఉమీద్'గా మార్చిన కేంద్రం
- ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 40 అత్యంత క్రూరమైనది... దాంతో ఏ భూమినైనా తమదేనని వక్ఫ్ బోర్డు ప్రకటించవచ్చు... అలాంటి దారుణమైన సెక్షన్‌ను రద్దు చేశాం
- లేదంటే పార్లమెంటు కూడా వక్ఫ్ ఆస్తే అంటారు!.. జేపీసీ చేసిన అనేక సిఫారసులను పొందుపర్చాం
- పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను వినియోగించాలి... బిల్లుపై చర్చలో మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**
వక్ఫ్ సవరణ బిల్లు-2024ను లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగాయి. వారి నిరసనల నడుమ బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వక్ఫ్ బిల్లు పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ-ఉమీద్)'గా మార్చినట్లు మిగతా 2

## గేట్లు ఒక్కసారిగా ఎందుకు తీశారు

ఎవరు చెబితే భక్తులను పార్కులోకి పంపారు?
'తొక్కిసలాట' ఘటనలో
సస్పెండైన డీఎస్పీపై కమిషన్ ప్రశ్నల వర్షం



**తిరుపతి, విశ్వంవాయిస్ న్యూస్ :** తిరుపతి 'శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులను బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కులోకి పంపాలని ఎవరు ఆదేశించారు?. ఆ నిర్ణయం టీటీడీదా లేదా పోలీసు శాఖదా? అక్కడ మిగతా 2

## మరో 50 ఏఎంసీలకు నేడో రేపో చైర్మన్లు!

15 రోజుల్లో మిగిలినవీ భర్తీ.. వీటితోపాటే
ఆలయ కమిటీలకు కూడా
నెలాఖరులోగా పీఏసీఎసల నియామకాలు




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** టీడీపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ల నియామకానికి టీడీపీ అధిష్ఠానం కసరత్తు కొలిక్కి వస్తోంది. మొత్తం 218 మిగతా 2

## భవ్య హెల్త్ సర్వీసుకు 104, 108 బాధ్యతలు

కొత్త సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో 104, 108 అంబులెన్సుల నిర్వహణకు ప్రభుత్వం కొత్త సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేసింది. ఇప్పటి వరకు సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రక్రియలో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సారథ్యంలో ఎస్ఆర్ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామిగా ఉన్న కన్సార్షియంను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మిగతా 2



# అమరావతికి నిధులొచ్చాయ్

- రాష్ట్ర ఖాతాలో జమ అయిన తొలి విడత రుణం
- రూ.3,535 కోట్లు విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు
- త్వరలో ఏడీబీ నుంచీ నిధుల విడుదలకు అవకాశం
- 2018 నుంచి అమరావతిని వెంటాడుతున్న జగన్
- రాజధానికి అప్పు వద్దంటూ ప్రపంచబ్యాంకుకు లేఖలు
- అన్నీ పరిశీలించాకే నిధులు విడుదల చేసిన బ్యాంకు
- రాజధానికి పెద్దసంఖ్యలో తరలివస్తున్న కార్మికులు

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగు పడింది. ప్రపంచ బ్యాంకు నుంచి తొలి విడత రుణం కింద రూ.3,535 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమయ్యాయి. తాజాగా ప్రపంచ బ్యాంకు నిధులు విడుదల చేయడంతో త్వరలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) నుంచి కూడా మొదటి విడత రుణం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజధాని కోసం ప్రపంచ బ్యాంకు రూ.6,700 కోట్లు, ఏడీబీ రూ.6,700 కోట్లు కలిపి మొత్తం రూ.13,600 కోట్లు అప్పుగా ఇస్తున్నాయి. మరో రూ.1,400 కోట్లను కేంద్రం మిగతా 2

## ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎన్నికైన ఐదుగురు సభ్యులు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. సోము వీర్రాజు, కొణిదెల నాగబాబు, బీటీ నాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లను మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులు రాష్ట్ర అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల శాసనమండలికి ఎన్నికైన ఐదుగురు సభ్యులు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. సోము వీర్రాజు(బీజేపీ), కొణిదెల నాగబాబు (జనసేన), బీటీ నాయుడు(టీడీపీ), పేరాబత్తుల రాజశేఖర్(టీడీపీ మిగతా 2

## హిందూత్వ-కార్పొరేట్ బంధంపైనే పోరాటం

హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడే
ధైర్యం వామపక్షాలదే
సీపీఎం 24వ అఖి
భారత మహాసభలో ప్రకాశ్ కరట్




**చెన్నై :** ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం.. అమెరికా సామ్రాజ్యవాదానికి దగ్గరగా ఉన్న హిందూత్వ-కార్పొరేట్ సంబంధాన్ని సూచిస్తాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరట్ వ్యాఖ్యానించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్, దానికి ఆధారమైన హిందూత్వ-కార్పొరేట్ సంబంధాన్ని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడే శక్తి, ధైర్యం వామపక్షాలకే ఉన్నాయని ఉద్ఘాటించారు. హిందూత్వ శక్తులు మిగతా 2

## ప్రభుత్వమే ఫైనల్

పాలన చేయాల్సింది కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే.. కోర్టులు కాదు

పార్లమెంటుకు, ప్రజలకు అదే జవాబుదారీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో పరిపాలన చేయాల్సింది కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమేనని.. న్యాయస్థానాలు కాదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. పార్లమెంటుకు, ప్రజలకు కార్యనిర్వాహక వ్యవస్థే జవాబుదారీగా పేర్కొన్నారు. బుధవారం మిగతా 2

## బీసీలకు టీడీపీ రక్షణ కవచం


బలహీన వర్గాలను ఊచకోత కోసిన వైఎస్ఆర్, జగన్



**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** 'బీసీలకు టీడీపీ రక్షణ కవచంగా ఉంది. ఆ వర్గాలకు గుర్తింపు తెచ్చింది నాడు ఎన్టీ రామారావు అయితే... ప్రస్తుతం సీఎం చంద్రబాబు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు' అని పలువురు మంత్రులు పేర్కొన్నారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ సంఘం అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జి.నరసింహ యాదవ్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, రామ్ ప్రసాద్ రెడ్డి, పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ... 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలహీనవర్గాలను మిగతా 2

## పాస్టర్ ప్రవీణ్ పడుతూ.. లేస్తూ..

వరుస ప్రమాదాలకు గురైన పాస్టర్ ప్రవీణ్ కుమార్



**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ పడుతూ లేస్తూ వరుస ప్రమాదాలకు గురైనట్టు సీసీటీవీ కెమెరాల పుటేజీలు తెలియజేస్తున్నాయి. ఇప్పటికే కీసర టోల్‌గేట్, విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద ఆయన బుల్లెట్‌పై మిగతా 2

## అవినీతి చక్రవర్తి జగన్‌రెడ్డి



విశ్వసనీయత లేని పత్రికలో నాపై నిందలు: సత్యకుమార్

**కడప :** 'పంచభూతాలను సైతం వదలిపెట్టకుండా దోచుకున్న అవినీతి చక్రవర్తిగా మాజీ సీఎం జగన్ ఖ్యాతిగాంచారు' అని మంత్రి వై.సత్యకుమార్ విమర్శించారు. బుధవారం బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైద్య శాఖలో నేను మిగతా 2

(మొదటిపేజీ తరువాయి)

## వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఓకే

వెల్లడించారు. సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ) చేసిన అనేక సిఫారసులను కూడా బిల్లులో పొందుపర్చినట్లు తెలిపారు. జేపీసీ సిఫారసులను బిల్లులో చేర్చలేదన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు.

ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని విమర్శలు గుప్పించారు. బిల్లుపై అర్ధరాత్రి వరకూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అనంతరం మూజువాణీ ఓటుతో 'ఉమీద్'ను ఆమోదించేందుకు స్పీకర్ ప్రయత్నించారు. అందుకు విపక్షాలు అభ్యంతరం తెలపడంతో ఓటింగ్ జరిపారు. అనుకూలంగా 226, వ్యతిరేకంగా 163 ఓట్లు వచ్చాయి.

విపక్ష సభ్యులు తాము ప్రతిపాదించిన ప్రతి సవరణపైనా ఓటింగ్ జరగాలని పట్టుబట్టారు. అన్ని సవరణలపై ఓటింగ్ జరపడంతో ఆమోదం లభించేసరికి అర్ధరాత్రి దాటింది. బిల్లుపై చర్చ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లు మతానికి సంబంధించినది కాదని, కేవలం ఆస్తుల విషయాలకు సంబంధించినదేనని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లులోని అత్యంత క్రూరమైన సెక్షన్ 40 రద్దు కానుందన్నారు. ఈ సెక్షన్ కారణంగా ఏ భూమినైనా తమదేనని ప్రకటించుకునే హక్కు వక్ఫ్ బోర్డు, ట్రైబ్యునల్‌కు ఉందని.. దీన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన సెక్షన్‌ను తాము తొలగించామని చెప్పారు. కొందరు ప్రతిపక్ష నేతలు చెబుతున్నట్లుగా ముస్లిం వర్గాలకు చెందిన ఏ భూమినీ తాము లాగేసుకోబోమని స్పష్టం చేశారు. "పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు హక్కులు దక్కుతాయి.

ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి అధికారి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టం చేశారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. తాజా బిల్లును పరిశీలించిన జేపీసీకి అభినందనలు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ అన్నారు. దానికి స్పందనగానే రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకునేందుకు ఈ బిల్లు తోడ్పడుతుందని, వక్ఫ్ ఆస్తులన్నీ డిజిటల్ పోర్టల్‌లో ఉంటాయని, ఎవరూ ఆక్రమించేందుకు ఆస్కారం ఉండదని రిజిజు చెప్పారు. బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

**దౌర్జన్యపూరితం: కాంగ్రెస్**

వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బిల్లును వ్యతిరేకించారు. కేంద్రం దౌర్జన్యపూరితంగా బిల్లును తెస్తోందని ఆరోపించారు. సభలో ప్రవేశపెట్టే బిల్లుకు సవరణలు ప్రతిపాదించే హక్కు సభ్యులకు ఉంటుందన్నారు. సవరణలకు కనీస సమయం ఇవ్వకుండా హడావుడిగా ప్రవేశపెట్టారని ఆక్షేపించారు. మోదీ సర్కారు ఆరెస్సెస్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెసపక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. బిల్లు కేవలం పాలనాపరమైన మార్పులకు సంబంధించినది కాదని.. మైనారిటీ వర్గాలను అవమానించడం, భారత సమాజాన్ని విభజించడమేనని చెప్పారు.కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. "జేపీసీ వేయాలన్నదే మీరు. కమిటీ సూచించిన మార్పులుచేర్పులను అంగీకరించకపోతే జేపీసీని ఎందుకు ఏర్పాటు చేయమన్నారు" అని ప్రశ్నించారు. వక్ఫ్ భూముల విషయంలో అవినీతిని అడ్డుకొని, పేద ముస్లింల భూమిని కాపాడడమే ఈ బిల్లు ఉద్దేశమని తెలిపారు. వక్ఫ్ అంటే అరబిక్‌లో అల్లా పేరుతో దానం అని అర్థమని, అది దాతృత్వ కార్యక్రమని చెప్పారు. మీది కాని భూమిని దానం చేయడాన్ని దాతృత్వమని అనరని గుర్తుచేశారు.

**అమిత్ షా, అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు**

వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. "ప్రపంచంలో అతిపెద్ద పార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోంది" అని బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. "అఖిలేశ్ నవ్వుతూ ఓ విషయం చెప్పారు. నేను కూడా అలాగే సమాధానం ఇస్తా. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది. వారి నుంచే అధ్యక్షుడిని నియమించుకుంటారు. కానీ, మేం 12-13 కోట్ల మంది పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు అలాంటిదేం అక్కర్లేదు. ఎందుకంటే మరో 25 ఏళ్లు మీరే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారు" అని షా బదులిచ్చారు.

**ముస్లింలపై యుద్ధం ప్రారంభించిన మోదీ సర్కారు: ఒవైసీ**

వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును ముస్లింలపై దాడిగా అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం మసీదులు, దర్గాలు, మదర్సాలు, ముస్లింల స్వేచ్ఛపై యుద్ధాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని విమర్శించారు. వక్ఫ్ బిల్లు రాజ్యాంగంలోని 14వ అధికరణాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఆక్రమణదారులే యజమానులు అయిపోతారని, ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డు పాలనలో భాగస్వాములవుతారని ఆరోపించారు. ఆలయాలు, మసీదుల పేరిట బీజేపీ దేశంలో వివాదాలు సృష్టించాలని చూస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన బిల్లు ప్రతులను చించివేశారు.

దేశంలో వక్ఫ్ బోర్డు నిర్వహణలోని

మొత్తం స్థిరాస్తులు: 8,72,324

వాటిలో ముఖ్యమైన ఆస్తుల వివరాలు : 1) శ్మశానాలు 1,50,569 2) దుకాణాలు 1,13,193 3) వ్యవసాయ భూములు 1,40,803 4) మసీదులు 1,19,280 5) ఇళ్లు 92,517 6) ప్లాట్లు 64,975 7) దర్గాలు 33,502

## ఎందుకు తీశారు

విధుల్లో ఉన్నది మీరేగా.. అప్పుడేం జరిగిందో చెప్పండి' అని 'తొక్కిసలాట' ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్‌ను విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. జనవరి 8న జరిగిన తొక్కిసలాట ఘటనపై కలెక్టరేట్ వేదికగా బుధవారం నాలుగో దశ విచారణ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 'అంతమంది భక్తులు పార్కులో ఉన్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఒక్కసారిగా గేట్లు ఎందుకు తెరిచారు?. తెరవాల్సిన అవసరం ఏమొచ్చింది' అని జస్టిస్ సత్యనారాయణమూర్తి అప్పటి డీఎస్పీని ప్రశ్నించారు. భక్తులను పార్కులోకి అనుమతించింది తాను కాదని ఆయన చెప్పారు. దీంతో టీటీడీ తరపు లాయర్లు.. ఆనాటి ఘటనకు సంబంధించిన వీడియో చూపిస్తూ... 'ఇందులో గేటు వద్ద ఉన్నది మీరే కదా?' అని ప్రశ్నించారు. ఓ భక్తురాలు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గేటు తీయాల్సి వచ్చిందని రమణకుమార్ చెప్పారు. సుమారు రెండు గంటలపాటు రమణకుమార్‌ను కమిషన్ విచారించగా, న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఘటనకు సంబంధించిన రికార్డులు ఇవ్వడానికి టీటీడీ గడువు కోరడంతో తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు. ఈ విచారణలో పూర్వపు సీవీఎస్వో శ్రీధర్, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు. బుధవారంతో నాలుగో దశ విచారణ ముగించుకుని కమిషన్ చైర్మన్ సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్లారు.

## నేడో రేపో చైర్మన్లు!

ఏంఎసీల్లో తొలి విడతగా గత నెల 28న 47 ఏఎంసీలకు చైర్మన్లను ప్రకటించారు. ఒకట్రెండు రోజుల్లో మరో 50 ఏఎంసీ చైర్మన్ల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. మిగతా నియామకాలు కూడా 15 రోజుల్లో పూర్తిచేసేయాలని భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ అధినేత చంద్రబాబు గ్రామ స్థాయి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆచితూచి అడుగు వేస్తుండడంతో కాస్త జాప్యం జరుగుతోంది. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడం కోసమే విస్తృతంగా కసరత్తు చేస్తున్నారు. వీటితోపాటే దేవాయలయ కమిటీలనూ ప్రకటించే అవకాశం ఉంది. అనంతరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస)ల భర్తీపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,250 పీఏసీఎసలు ఉన్నాయి. వీటికి చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత నామినేటెడ్ చైర్మన్లు లేదా పర్సన్ ఇన్‌చార్జులతో నడిపిస్తున్నారు.

సీఎంతో వంగవీటి రాధా భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబును వంగవీటి రాధాకృష్ణ సచివాలయంలో కలిశారు. బుధవారం సాయంత్రం సుమారు అరగంటపాటు ఆయనతో సమావేశమయ్యారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీల జాబితాలో రాధా పేరు ఉంటుందని భావించారు. కానీ ఖాళీ అయిన ఐదు స్థానాల్లో జనసేన, బీజేపీలకు చెరొకటి కేటాయించడంతో ఆయనకు ఇవ్వలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుండడంతో రాధాకు నామినేటెడ్ పోస్టు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపైనే రాధా పార్టీ అధినేతను కలిసినట్లు సమాచారం.

అమరావతి చిత్రకళా వీధికి సీఎం మద్దతు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం గురించి వివరించేందుకు సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని బుధవారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా అమరావతి అంశంపై రూపొందించిన చిత్రలేఖనానికి చంద్రబాబు కుంచెతో రంగులు వేసి తన మద్దతు తెలిపారు. ఇక, రాజమండ్రిలో ఈనెల 4న 'అమరావతి చిత్రకళావీధి' నిర్వహిస్తున్నామని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని తెలిపారు. మన కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, మంత్రి దుర్గేష్ సహకారంతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 104, 108 బాధ్యతలు

కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో ఎక్కడా లేని విధంగా 104 వాహనాల ద్వారా గ్రామీణులకు 47 రకాల రోగ నిర్ధారణ(డయాగ్నోస్టిక్) పరీక్షలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను రూపొందించడానికి ఈ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం, బీపీ పరీక్షలు మాత్రమే(ర్యాపిడ్ కిట్ ద్వారా) చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయనున్నారు. బ్లడ్ గ్లూకోజ్, కాలేయ పనితీరు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, మూత్ర విశ్లేషణ ఇలా 20 రకాల పరీక్షలు చేస్తారు. అదేవిధంగా నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్షలు చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షలను ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షలను పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టనుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాల్ని ప్రతి 104 వాహనంలో సెమీ-ఆటోమెటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సీబీసీ మెడిసిన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వాహనంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు.

**108కి2 షరతులు :** కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాల్ని సొంతగా కొనుగోలు చేయనుంది. కొత్త వాహనాలు అందుబాటులోకి రావడంతో 731 వాహనాలు 108 సేవల్ని అందిస్తాయి. 108 సేవలకు సంబంధించి, సర్వీస్ ప్రొవైడర్‌కు రెండు షరతులు పెట్టారు. కాల్ వచ్చినప్పటి నుంచి రోగిని ఒక గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దీనిని గోల్డెన్ అవర్‌గా పేర్కొంది. రెండోది.. అత్యవసర కాల్స్‌ను తప్పకుండా రిసీవ్ చేసుకోవాలి. ప్రస్తుతం 108 సేవలు అందిస్తున్న సంస్థ రోజుకు దాదాపు 200 ఎమర్జెన్సీ కాల్స్‌ను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ఈ షరతులు పెట్టడం గమనార్హం.

## అమరావతికి నిధులొచ్చాయ్

ఏపీకి ప్రత్యేక సాయంగా అందిస్తోంది. ఈ నిధులను రాష్ట్ర రుణ పరిమితిలో (ఎఫ్‌ఆర్‌బీఎం) లెక్కించకూడదని కేంద్రం నిర్ణయించింది. హడ్కో నుంచి రూ.11,000 కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. అలాగే, జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5,000 కోట్ల రుణాలు తీసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

**రాజధానిపై వైసీపీ కుట్రలతో జాప్యం :** అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ చెరో రూ.6,700 కోట్ల చొప్పున రుణాన్ని గతేడాది డిసెంబరులో ఆమోదించాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలోనే ప్రపంచ బ్యాంకు నుంచి మొదటి విడత అప్పు విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతం రాజధానిగా పనికిరాదని, అప్పు ఇవ్వొద్దంటూ కొందరు ఆ బ్యాంకుకు లేఖలు రాశారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేసరికి 2నెలలు ఆలస్యమైంది. 2018లో కూడా వైసీపీ ఇలాంటి కుట్రలే చేసి అమరావతికి అప్పు రాకుండా అడ్డుపుల్లలు వేసింది. కానీ, ఈసారి వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వాస్తవానికి 2018లోనే రాజధాని నిర్మాణానికి రుణం మంజూరు చేయడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. కానీ ఆ నిధులు రాకుండా నాటి ప్రతిపక్ష నేత జగన్, విజయసాయిరెడ్డి కుట్రలు పన్నారు. అప్పటి ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేస్తూ ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాశారు. అమరావతి వరదలకు మునిగిపోతుందని పదేపదే ఈ-మెయిళ్లు పంపారు. రాజధాని గ్రామాలతో సంబంధంలేని రైతులతోనూ ఫిర్యాదులు చేయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ జగన్ రోతపత్రికలో విషపు కథనాలు వండివార్చారు. ఈ పరిణామాలతో ప్రపంచ బ్యాంకు వెనక్కి తగ్గింది. అనంతరం సీఎం అయిన జగన్... అమరావతి నిర్మాణానికి తమకు రుణం అక్కర్లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారు. 2014-19లో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్లను క్లోజ్ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు వంటి 19 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ రూ.16,871 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక వీటికి అంచనాలు తయారుచేశారు. 31 సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. పనులకు టెండర్లు కూడా ఖరారు చేశారు.

**పనుల సందడి :** రాజధానిలో పనుల సందడి ప్రారంభమైంది. ఏప్రిల్ మూడో వారంలో ప్రధాని చేతుల మీదగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దసంఖ్యలో కార్మికులు వస్తున్నారు. రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసే పనులు కూడా సమాంతరంగా సాగనుండడంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలకు చేతినిండా పని ఉంటోంది. నిర్మాణాలకు ముందస్తు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయా సంస్థలు బిజీగా ఉన్నాయి. గతంలో ఆగిపోయిన ప్రభుత్వ భవనాల వద్ద కార్మికుల కోసం భారీస్థాయిలో రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. క్లాస్-4, న్యాయమూర్తులు, మంత్రుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన బీఎసఆర్ ఇన్‌ఫ్రా సంస్థ.. దాదాపు 200 మంది కార్మికుల కోసం షెడ్డును సిద్ధం చేసింది. హ్యాపీనెస్ట్ కాంట్రాక్టు పొందిన ఎన్‌సీసీ సంస్థ షెడ్లను నిర్మించింది. జడ్జిల భవన సముదాయం వద్ద కూడా పనులు జరుగుతున్నాయి. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన కేఎంవీ సంస్థ ఆ నిర్మాణాలకు సమీపంలో షెడ్లు నిర్మిస్తోంది. రాజధానిలో ఈ-6 నిర్మాణ కాంట్రాక్టు తాజాగా పొందిన ఆర్‌వీఆర్ కంపెనీ తుళ్లూరు శివారులో గతంలో వేసిన షెడ్లను సకల సౌకర్యాలతో కార్మికుల కోసం సిద్ధం చేస్తోంది. సీఎం చంద్రబాబు వెలగపూడిలో ఇటీవల కొన్న స్థలానికి సంబంధించి బీఎసఆర్ సంస్థ పనులు ప్రారంభించింది. రాయపూడి కృష్ణానది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఫిల్టర్ ట్యాంకు పైపులైను పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటితో పాటు కంప చెట్ల తొలగింపు, మెరక, చదును చేయడం వంటి పనుల్లో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు.

**ఈ నెలలోనే ప్రధాని మోదీ రాక! :** రాజధాని పనులను పునఃప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని మోదీ ఈ నెలలో అమరావతికి రానున్నారు. మోదీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్ విజయానంద్ బుధవారం అమరావతి సచివాలయంలో అధికారులతో ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షిస్తామని, ఈలోపు శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**అమరావతిలో సింగపూర్ బృందం :** రాజధాని అమరావతిలో సింగపూర్ కన్సార్షియం బృందం బుధవారం పర్యటించింది. స్టార్టప్ ఏరియా నిర్మాణంలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోమారు కోరిన నేపథ్యంలో ఈ బృందం రాజధానిలో పర్యటించింది. కోర్ క్యాపిటల్ పరిధిలోని పలు ప్రభుత్వ భవన సముదాయాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవన సముదాయంతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధుల భవనాలను పరిశీలించింది. అంతకుముందు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రజా రాజధానిని నిర్మించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. సుమారు రూ.లక్ష కోట్ల పనులు పునఃప్రారంభం, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధాని మోదీ ఈ నెలలోనే శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. సింగపూర్ ప్రతినిధులు ఫ్రాన్సిస్ చోంగ్, అడ్రేటాన్, ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. కాగా, నేడు మంత్రి లోకేశ్‌తో పాటు సీఎం చంద్రబాబుతో సింగపూర్ కన్సార్షియం ప్రతినిధులు భేటీ కానున్నారు.

## ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

ఆలపాటి రాజేంద్రప్రసాద్(టీడీపీ)లతో బుధవారం అమరావతి అసెంబ్లీ భవనంలో మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, బీటీ నాయుడు అసెంబ్లీ గేటు బయట మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో హైద్రాబాద్ వంటి మహానగర నిర్మాణం జరుగుతోంది. ప్రధాని మోదీ అన్ని విధాలా సహకరిస్తున్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ముందుకు వెళుతోంది. వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ముందుకు వెళుతోది. సూపర్ సిక్స్ అమలు తీరుతో ప్రతిపక్షం భయపడుతుంది' అని సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ, 'టీడీపీలో డబ్బులు, గాడ్ ఫాదర్ అవసరం లేదు. కష్టపడి పని చేస్తే గుర్తింపు ఉంటుంది. అందుకు ఉదాహరణ నేనే. టీడీపీ అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ. గతంలో రాక్షస పాలన సాగింది. 56 కార్పొరేషన్లు పెట్టి బల్లలు, కుర్చీలు, ఇచ్చారు తప్ప నిధులు, విధులు లేవు. గత ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడూ బడుగులను గౌరవించలేదు. 76 సంవత్సరాల వయస్సులోను సీఎం చంద్రబాబు కష్టపడి పని చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తున్నారు' అని అన్నారు.

## ప్రభుత్వమే ఫైనల్

రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్)ను వికేంద్రీకరించాలంటూ డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్‌వీఎన్ సోము చేసిన డిమాండ్‌పై కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఇది డీఎంకే భాగస్వామిగా ఉన్న యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానమని.. నీట్‌ను కేంద్రీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ జోక్యం చేసుకున్నారు. 'ప్రభుత్వమే ఫైనల్. ప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాన్ని కోర్టుతో కలిసి పంచుకోగలదా? ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే పాలన చేయాలి. ఎందుకంటే అదే పార్లమెంటుకు, ప్రజలకు జవాబుదారీ. దేశాన్ని పాలించేందుకు ప్రజలు దానిని ఎన్నుకుంటారు. అందుచేత ఈ అంశంపై దృష్టి సారించండి' అని సూచించారు.

## బీసీలకు టీడీపీ రక్షణ కవచం

ఊచకోత కోశారు. జగన్ 56 కార్పొరేషను పెట్టి పైసా కేటాయించకుండా బీసీలను మోసం చేశారు' అని అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, హత్యలు జరిగాయి. సీఎం చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో 8 మంది బీసీ మంత్రులు ఉన్నారు' అని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ల నారాయణ, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డి.రామారావు, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చైర్మన్ నరసింహ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.

## హిందూత్వ-కార్పొరేట్ బంధంపైనే పోరాటం

నిర్వహిస్తున్న రాజకీయ ఆధిపత్యం కేవలం ఎన్నికల మార్గాల ద్వారా మాత్రమే కాదన్నారు. అది సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో హిందూత్వ శక్తులు ప్రదర్శించే ప్రభావం ద్వారా సంపాదించిన ఆధిపత్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మనం అవలంభించే రాజకీయ -వ్యూహాత్మక పంథాలో.. బీజేపీ-ఆర్ఎసఎస్, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటం చేయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తమిళనాడులోని మదురైలో సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రకాశ్ కరట్ మాట్లాడుతూ.. "వామపక్షాలు.. ఐక్య పోరాటాలు, ఓటములు, ఇతర పార్టీలతో ఇమడలేకపోవడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. హిందూత్వ నయా ఫాసిజంపై పోరాడేందుకు వామపక్షాలకు మాత్రమే ద్రుఢ నిశ్చయం, ధైర్యం, శక్తి ఉన్నాయి." అని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎసఎసలకు వ్యతిరేకంగా వామపక్షాల ఐక్యతను బలోపేతం చేయడానికి, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడానికి సీపీఎం కృషి చేస్తుందని తెలిపారు. "డొనాల్డ్ ట్రంప్ తన సన్నిహితుడుగా ఎవరిని చెప్పుకొంటున్నారు? గౌతం అదానీ, ముఖేశ్ అంబానీలకు మిత్రుడు ఎవరు? ఆర్ఎసఎస్ పట్ల విధేయత చూపిస్తోందెవరు?.. ఈ మూడు ప్రశ్నలకు ఒక్కటే సమాధానం.. నరేంద్రమోదీ, బీజేపీ" అని కరట్ వ్యాఖ్యానించారు. '

## పాస్టర్ ప్రవీణ్ పడుతూ.. లేస్తూ..

ప్రయాణిస్తూ అదుపు తప్పి పడిపోయిన ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చిల్లకల్లు టోల్‌గేట్ సమీపంలోనూ ఆయన బుల్లెట్ నడుపుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన మరో సీసీటీవీ ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. మార్చి 24న ఆయన హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయలుదేరారు. తెలంగాణ సరిహద్దు దాటాక ఎన్టీఆర్ జిల్లాలో కీసర టోల్‌గేట్ వద్ద బుల్లెట్ అదుపుతప్పి పడిపోయింది. అక్కడ ఆయనకు ప్రాథమిక వైద్యం చేసిన అంబులెన్స్ సిబ్బంది దీనికిముందు మరో ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. ఆ మేరకు చిల్లకల్లు టోల్‌గేట్ దాటడానికి ముందే జరిగిన ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీ తాజాగా విడుదలైంది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు తెలంగాణ సరిహద్దు దాటాక చిలకల్లు టోల్‌గేటులోకి ప్రవేశిస్తాయి. ఈ టోల్‌గేట్ చేరుకోవడానికి ముందే జగ్గయ్యపేటలోని ఇండస్ట్రియల్ కారిడార్ వద్ద ఉన్న వై జంక్షన్‌లో ప్రవీణ్ ప్రమాదానికి గురైనట్టు పోలీసులు గుర్తించారు. ముందు వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేయబోయి ప్రవీణ్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఆ వెనుకే వస్తున్న బస్సును డ్రైవర్ వెంటనే పక్కకు తిప్పడంతో ప్రవీణ్‌కు పెను ప్రమాదం తప్పింది. అయితే, ప్రవీణ్ ప్రమాద స్థలం నుంచి లేవలేక కాసేపు అలాగే కూర్చుండిపోయారు. వెనుక వచ్చిన వాహనదారులు సాయం చేసేందుకు రాగా, ప్రవీణ్ మెల్లగా లేచి నిల్చున్నారు. ముగ్గురు వ్యక్తులు బుల్లెట్‌ను లేపి రోడ్డు పక్కన స్టాండ్ వేసి నిలిపారు. అనంతరం తూలుతూనే బుల్లెట్ ఎక్కిన ప్రవీణ్ దానిని స్టార్ట్ చేయడానికి కొద్దిసేపు నానా తంటాలు పడిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. ఇక్కడే కుడి చేయిపై గీసుకున్న గాయమైనట్టు తెలుస్తోంది. తర్వాత ఆయన కీసర టోల్‌గేట్ సమీపంలో, రామవరప్పాడు రింగ్ వద్ద ఇంకోసారి అదుపుతప్పి పడిపోయారని అక్కడి సీసీ కెమెరాల ఫుటేజీల్లో వెల్లడైంది. సీసీ కెమెరాల ఫుటేజీలన్నింటినీ పరిశీలిస్తున్న పోలీసులు.. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ వరుస ప్రమాదాలకు గురైనట్టు గుర్తించారు.

## అవినీతి చక్రవర్తి జగన్‌రెడ్డి

అవినీతికి పాల్పడినట్లుగా విశ్వసనీయత లేని ఆయన రోత పత్రికలో అసత్య రాతలు రాయడం మరీ విడ్డూరం. మోదీ, చంద్రబాబు హయాంలో అటు దేశం, ఇటు రాష్ట్రం వికసిత్ భారత్, ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోనున్నాయి. మరో 10 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వాలు అధికారంలో కొనసాగేలా ప్రజలు ఆశీర్వదించాలి' అన్నారు. ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఓడల రేవు సొసైటీ కార్యదర్శి మృతి

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :**

హనీ ట్రాప్ లో చిక్కుకుని వారం రోజులు పాటు ప్రాణాలతో పోరాడిన సత్తి వెంకటేశ్వరరావు (59) బుధవారం మృతి చెందారు. ఇప్పటికే ఇతన్ని ట్రాప్ చేసిన మహిళతో పాటు ఇద్దరు వ్యక్తులను హత్య యత్నం నేరం కింద అరెస్ట్ చేశారు. వెంకటేశ్వరరావు చనిపోవడంతో హత్యయత్నాన్ని హత్య కేసుగా అమలాపురం పట్టణ పోలీసులు నమోదు చేశారు.ం

### పలు శుభకార్యాలు పాల్గొన్న
## సంజీవ్ బండారు టిడిపి నాయకులు



**కొత్తపేట ఆత్రేయపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో మరడాపు అప్పలనాయుడు కుమార్తె రజస్వల వేడుకలో ఆలమూరు గ్రామంలో కొమ్మిశెట్టి శ్రీనివాస్ కుమార్తె రజస్వల వేడుకులో మరియు నర్సిపూడి గ్రామంలో ఉండమట్ల పుల్లయ్య మనవరాలు రజస్వల వేడుకలో పాల్గొన్న యువనేత బండారు ఆయన వెంట కుటమి నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.


# విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

గురువారం, 3-4-2025
www.viswamvoice.com






### సోము వీర్రాజు ప్రమాణస్వీకారం
## మహోత్సవంలో నల్లా పవన్




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :**

బుధవారం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అమరావతి శాసనమండలిలో రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసారు. ఈ ప్రమాణస్వీకారం మహోత్సవంలో పాల్గొని, అనంతరం విజయవాడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొని సోము వీర్రాజును శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియచేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ మరియు బీజేపీ నేతలు మాలే శ్రీనివాస్, చొల్లంగి త్రినాథ్, గోకరకొండ గంగన్న స్వామి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని
## జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్**
**జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్**




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సభ జరిపిన వారిపైనా, ఆ సభలో పాల్గొన్న అధికారుల పైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మార్చి 25 న రాయవరం మండల కేంద్రంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల పని వేళల్లో పదవీ విరమణ సభ ఏర్పాటు చేయడంలో కొంతమంది ఉపాధ్యాయులు అత్యుత్సాహం చూపారని ఆరోపించారు. మండుటెండలో పాఠశాల ప్రాంగణంలో సభ ఏర్పాటు చేయడం వల్ల పాఠశాల విద్యార్థిని , విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో సభ నిర్వహించడం ఏమిటని అభ్యంతరం తెలపాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సభకు హాజరు కావడం ఆశ్చర్యాన్ని గురి చేసిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖపరమైన చర్యలను తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలుస్తానని పేర్కొన్నారు.

## పురుగు మందు తాగి వ్యక్తి మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం :**

స్థానిక రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన దామోదర కోటేశ్వరరావు అనారోగ్యం పాలై మానసిక స్థితి సరిగా లేనందున ఇంటి వద్ద ఉంటూ ఏప్రియల్ ఒకటో తారీఖున ఉదయం ఐదు గంటలకి తన ఇంటి వద్ద క్రిమిసంహారక మందు త్రాగటం వలన హాస్పిటల్లో జాయిన్ అయినట్లు మెరుగైన వైద్య నిమిత్తం తన కుమారుడు దామోదర్ వెంకన్న బాబు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి తీసుకుని వెళ్లి జాయిన్ చేయగా చికిత్స పొందుతూ ఈరోజు చనిపోయినట్లు ఇచ్చిన రిపోర్టుపై రావులపాలెం ఎస్సై నాయుడు రాము కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

### ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రమాణ స్వీకారంకు గోనెమడతల కనకరాజు ఆధ్వర్యంలో తరలివెళ్లిన
## కొత్తపేట. పి.గన్నవరం నియోజకవర్గాల బీజేపీ నేతలు



**రావులపాలెం, విశ్వంవాయిస్ న్యూస్ :** రావులపాలెం ఎమ్మెల్సీ సోము ప్రమాణ స్వీకారంకు తరలివెళ్లిన బీజేపీ నేతలు ఎన్డియే కూటమి ప్రభుత్వంలో ఇటీవల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు జాతీయ కార్యవర్గ సభ్యులు. సీనియర్ నేత. సోము వీర్రాజు బుధవారం నాడు అమరావతిలోని రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి. గన్నవరం. కొత్తపేట నియోజకవర్గాల బీజేపీ నేతలు తరలివెళ్లారు బీజేపీ సీనియర్ నాయకులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి.గోనెమడతల కనకరాజు ఆధ్వర్యంలో అంబాజీపేట మండలంలోని వాకలగరువు నుండి రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట నుండి పలువురు బీజేపీ నేతలు ర్యాలీగా కారుల్లో బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు.కో.కన్వీనర్ గంధ్రోతు వీరగోవిందరావు. యస్.సి.మోర్చా జిల్లా అధ్యక్షులు. పోనుగుపాటి శ్రీనివాస్.ఓబిసి మోర్చా నాయకులు పసుపులేటి మహాలక్ష్మిరావు. కముజు శ్రీనివాస్. జి.రాజు.కొప్పిరెడ్డి విజయ్.మద్దింశెట్టి బాబీ.కొప్పిరెడ్డి సతీష్.అడపా వెంకటరత్నం. వీరబాబు. బుజ్జి తదితరులు తరలివెళ్లారు.

### జర్నలిస్టుగా పని చేసి మృతి చెందిన
## వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**





**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** సుదీర్ఘ కాలం పాటు కొత్తపేట,రావులపాలెం మండలంలో పలు పత్రికలకు జర్నలిస్టుగా పని చేసి ఇటీవలి అనారోగ్యంతో మృతి చెందిన చింతం వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం కొత్తపేట మండలం మందపల్లిలో వెంకటేశ్వర స్వగృహం వద్ద జరిగిన సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటేశ్వర సుదీర్ఘకా లం పాటు జర్నలిస్టుగా అందించిన సేవలు మరువలేమన్నారు. అటు అధికారులు ఇటు ప్రజాప్రతి నిధులు ఆయనకు ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఇచ్చేవారన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వెంకటేశ్వరరావు జర్నలిజాన్ని దగ్గరగా చూశానని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. తాను కాపు రిజర్వేషన్ పోరాట సమితి ద్వారా ఉద్యమాలు చేపట్టినప్పుడు వెంకటేశ్వరరావు అప్పుడు ఈనాడు విలేఖరిగా ఉండి తమ ఉద్యమానికి సహకారం అందించారని టిటిపి నాయకులు ఆకుల రామకృష్ణ తెలిపారు.కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ తాను ఇక్కడ ఎస్సైగా పనిచేసినప్పుడు నుంచి వెంకటేశ్వరరావు ఆయన కుటుంబంతో మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవన్నారు. జర్నలిస్టుగా అతను చేసిన కృషి ప్రసంశనీయమన్నారు.అలాగే రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపియు డబ్ల్యూ జె అధ్యక్షులు స్వాతి ప్రసాద్,ఉపాధ్యక్షులు జగతా రాంబాబు, సీనియర్ జర్నలిస్టు బోగిశెట్టి నాగేశ్వరరావు తదితరులు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు భార్య కృష్ణవేణి, కుమార్తెలు సీతామహాలక్ష్మి,విజయలక్ష్మి, సోదరుడు కృష్ణ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

### శాసనమండలి సభ్యులుగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు
## ప్రమాణ స్వీకారంకు బీజేపీ నేతలు



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కొత్తపేట.పి.గన్నవరం నియోజకవర్గాల బీజేపీ నేతలు.ఎమ్మెల్సీ సోము ప్రమాణ స్వీకారంకు తరలివెళ్లిన బీజేపీ నేతలు ఎన్డియే కూటమి ప్రభుత్వంలో ఇటీవల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు జాతీయ కార్యవర్గ సభ్యులు.సీనియర్ నేత. సోము వీర్రాజు బుధవారం నాడు అమరావతిలోని రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి. గన్నవరం.కొత్తపేట నియోజకవర్గాల బీజేపీ నేతలు తరలివెళ్లారు బీజేపీ సీనియర్ నాయకులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి గోనెమడతల కనకరాజు ఆధ్వర్యంలో అంబాజీపేట మండలంలోని వాకలగరువు నుండి రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట నుండి పలువురు బీజేపీ నేతలు ర్యాలీగా కారుల్లో బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు.కో.కన్వీనర్ గంధ్రోతు వీరగోవిందరావు. యస్.సి.మోర్చా జిల్లా అధ్యక్షులు. పోనుగుపాటి శ్రీనివాస్.ఓబిసి మోర్చా నాయకులు పసుపులేటి మహాలక్ష్మిరావు. కముజు శ్రీనివాస్. జి.రాజు.కొప్పిరెడ్డి విజయ్.మద్దింశెట్టి బాబీ.కొప్పిరెడ్డి సతీష్.అడపా వెంకటరత్నం. వీరబాబు. బుజ్జి తదితరులు తరలివెళ్లారు.

### చెరువులను ఆక్వా జోన్లో చేర్చేందుకు చర్యలు : ఏవో లక్ష్మి లావణ్య, పిషరీష్ అసిస్టెంట్ హెలీనా



**ఆలమూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** తవ్వి వదిలేసిన వివిధ రకాల చెరువులను ఆక్వా జోన్లో చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఏవో ఎస్.లక్ష్మి లావణ్య, పిషరీష్ అసిస్టెంట్ హెచ్.హెలీనా అన్నారు. మండలంలోని చొప్పెల్ల గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ డేవిడ్ రాజు అదేశాల మేరకు సర్పంచ్ గంగేటి దంగేటి చంద్రకళ బాపనయ్య అధ్యక్షతన చెరువులు గల రైతులతో బుధవారం వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామ పరిధి రెవెన్యూ భూమిలో 12 మంది రైతులకు చెందిన య 8.88 సెంట్లు పరిధిలో 8 చెరువులు ఉన్నాయన్నారు. వాటిని వారి అనుమతితో ఆక్వా జోన్లో చేర్చనున్నట్లు వారు వివరించారు. అలాగే మండల పరిధిలో ఆయా గ్రామాల్లో గల రైతులు వివిధ కారణాలతో తవ్విన చెరువులను గుర్తించి వాటిని ఆక్వా చెరువులుగా తీర్చి దిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, కార్యదర్శి ఎం.వెంకట్ రెడ్డి, నాయకులు దంగేటి బాపనయ్య నాగిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగన్మోహిని కేశవ స్వామి వారి
## దివ్య కళ్యాణ మహోత్సవము

**శుభపత్రికలను ఆవిష్కరించిన శాసనసభ్యులు**



**కొత్తపేట ఆత్రేయపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి దేవస్థానమందు జగన్మోహిని కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవముల సందర్భంగా కేశవ దీక్ష మాలాధారణ కార్యక్రమం మొదలైంది. కేశవ దీక్షాధారులు ఈ రోజు నుండి 13-04-2025 వరకూ అత్యంత నిష్ఠతో, మాలా నియామములు పాటిస్తూ, శ్రీ స్వామి వారి సేవలో తరిస్తారు జగన్మోహిని కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవముల సందర్భంగా కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు కళ్యాణం శుభపత్రికలను ఆవిష్కరించారు అని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

### శాస్త్రీయ అనుభవ
## యాత్ర శుభ పరిణామం



**అమలాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** శాస్త్రీయ విజ్ఞాన అంశాలపై ప్రత్యక్ష అనుభవం, అధ్యయనానికి తోడ్పడుతుందని ఆ దిశగా శాస్త్రీయ అనుభవ యాత్ర మంచి పరిణామమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ యాత్ర పోస్టర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ నెల 4, 5 తేదీల్లో శాస్త్రీయ అనుభవ యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శాస్త్రీయ అంశాలపై అవగాహన పెంచుకోవడానికి రెండు రోజుల పాటు సందర్శన యాత్ర విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్శన మంచి ప్రేరణతో సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందిస్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో కెరీర్ అవకాశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు పి.శ్రీకర్, డి.అఖిల, కె.మాధవి, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై శాంతి ర్యాలీ




**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతూ రామచంద్రపురం పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. అనంతరం రామచంద్రపురం ఆర్‌డిఒ, డిఎస్‌పిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల పాస్టర్లు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలమూరు పాస్టర్ల ఐక్య సంఘటన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. తహశీల్దారు కెజె.ప్రకాష్ బాబుకు వినతిపత్రం అందజేశారు.

విశ్వవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

# ఎడిటర్ వాయిస్

## పేదల పొట్టగొట్టొద్దు

గ్రామీణ పేదలకు అండగా ఉంటున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ఉసురు తీయాలని చూడటం అమానుషం. ఈ ఏడాది మార్చి 21 నాటికి రూ.26 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం మీనమీషాలు లెక్కిస్తోంది. అందులో మన రాష్ట్రానికి రావాల్సిన బకాయి రూ.2,030 కోట్లు. కేరళకు రూ.1,055 కోట్లు, తమిళనాడుకు రూ.3,725 కోట్లు, ఉత్తర ప్రదేశ్‌కు రూ.3,668 కోట్లు, బీహార్‌కు రూ.2,849 కోట్లు..ఇలా%దాదాపు అన్ని రాష్ట్రాలకూ బకాయిలున్నాయి. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ ఈ ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రధాని అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీ కుటుంబ సంపద ఈ ఏడాది అక్షరాలా లక్ష కోట్ల రూపాయలు పెరిగి, ఆసియాలో రెండో సంపన్నుడిగా కొనసాగుతున్నాడు. మన దేశంలోని 284 మంది బిలియనీర్ల చేతిలో భారత జిడిపిలో దాదాపు మూడింట ఒక వంతు సంపద అంటే రూ.98 లక్షల కోట్లు పేరుకుపోయింది. కార్పొరేట్లకు సమస్త వనరులనూ కట్టబెడుతుండటంతోపాటు రూ.16 లక్షల కోట్లు బ్యాంకుల నుంచే దోచిపెట్టిన మోడీ ప్రభుత్వం ఎందుకు 'ఉపాధి' బకాయిల చెల్లింపులో జాప్యం చూపుతోంది? వామపక్షాల చొరవతో యుపిఎ-1 హయాంలో 2005లో ఉపాధి హామీ చట్టం రూపుదాల్చింది. గ్రామీణ పేదలకు కనీసం వంద రోజుల ఉపాధికి హామీ ఇవ్వాలనేది ఈ చట్టం ప్రధానోద్దేశం. బిజెపి, మోడీ అప్పట్లో బహిరంగంగానే ఈ చట్టంపై విమర్శలు గుప్పించారు. ఉపాధి హామీ చట్టం ఒక హక్కు, లబ్ధిదారులు ప్రజల ఉమ్మడి సంపద సృష్టికర్తలు. చేసిన పనికి ప్రతిఫలం పొందుతారు. ఎవరికీ కృతజ్ఞత చూపవలసిన అవసరమూ లేదు. వారికి బేరమాడే శక్తీ వస్తుంది. ఈ విధమైన హక్కులు పేదల ఆత్మగౌరవాన్ని పెంచడంతోపాటు సాధికారతనూ కల్పిస్తాయి. ప్రజల వద్ద ఏ అధికారమూ ఉండటం బిజెపికి ఎంతమాత్రం నచ్చదు. అందుకే ఉపాధి హామీ చట్టం మీద దాడి కొనసాగుతూనే ఉంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతన బకాయిలను పని ముగిసిన తరువాత 15 రోజుల్లో చెల్లించాలి. ఆలస్యమైతే రోజుకు 0.05 శాతం చొప్పున పరిహారం చెల్లించాలి. గ్రామ పంచాయతీ లేదా జిల్లా అధికారికి ఫిర్యాదు చేయొచ్చు. పనే కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇంతవరకూ పరిహారం గాని, నిరుద్యోగ భృతి కానీ చెల్లించలేదు. ఇది చట్టాన్ని దారుణంగా అతిక్రమించడమే. వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం చేయడం ఈ పనుల పట్ల కూలీల్లో విముఖత పెంచి, చట్టాన్ని దెబ్బతీసే వ్యూహమే! ఉపాధి పనుల్లో మెటీరియల్ కాంపొనెంట్ నిధులను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచి యంత్రాల పనులుగా ఇప్పటికే మార్చేసింది. ఇప్పుడు రావాల్సిన బకాయిల్లోనూ కార్మికుల వేతనాల కింద రూ.15,277 కోట్లు, సామగ్రి, పాలనా ఖర్చుల కింద రూ.10,820.23 కోట్లు ఉన్నాయి. చట్టం హామీ ఇచ్చిన వంద రోజుల నుంచి 34 రోజులకు వ్యవసాయ కార్మికుల పనిదినాలు పడిపోయాయి. ఏడాది కాలంలోనే దేశంలో ఆరు కోట్ల జాబ్‌కార్డులను రద్దు చేసింది. కేంద్ర బడ్జెట్ పెరుగుతున్నా ఉపాధి చట్టానికి మూడేళ్లుగా కేటాయింపులు పెంచకపోగా, రూ.86 వేల కోట్లకే పరిమితం చేసింది. రోజుకు రూ.345 కూలి చెల్లించాలని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు కాగితాలకే పరిమితమైంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, అగ్రవర్ణాల గ్రామీణ పేదలు ఉపాధి దెబ్బతింటోంది. చట్టం సమర్థవంతంగా అమలు చేయాలంటే రూ.2.5 లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉన్నా% కేంద్రంలోని ఎన్‌డిఎకు పట్టడం లేదు. ప్రతిపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు పార్లమెంట్ లోపలా, బయటా ఆందోళన చేస్తున్నా మీనమేషాలు లెక్కిస్తోంది. బకాయిల కోసం కేరళ, తమిళనాడు తదితర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై పోరాడుతున్నాయి. మోడీ ప్రభుత్వ బాటలోనే మన రాష్ట్రంలోనూ వివిధ కారణాలు చూపుతూ 13 లక్షల జాబ్‌కార్డులు తగ్గించారు. మరింతగా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్థిక అగ్రశక్తిగా ఎదుగుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ సర్కారు ఇకనైనా 'ఉపాధి' బకాయిలన్నీ చెల్లించాలి. వీటిపై మరింత సంఘటితంగా గ్రామీణ పేదలు పోరాడేందుకు సహకరించాల్సిన బాధ్యత అందరిదీ.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఉన్నోళ్ల దయతో పేదరికం పోతుందా?

ఉన్నోళ్ల దయతో రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పేదరికం నుంచి విముక్తి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది రోజున ఘనంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ (పి4)ను ప్రకటించి ఈ కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు. పి4 పేరిట ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల ప్రయోజనం ఉంటుందా? అన్న ప్రశ్న పలువురిలో ఉంది. పది వేల మంది బంగారు కుటుంబాల (పేదలు) వారు, 600 మంది మార్గదర్శకులు (సంపన్నులు)తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మచ్చుకు ఓ రెండు కుటుంబాలను ఎంపిక చేసుకుని వారితో మాట్లాడారు. వారి సమస్యలను ప్రస్తావిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి 600 మంది మార్గదర్శకులలో మచ్చుకు ముగ్గురు పారిశ్రామికవేత్తలతో ఆ వేదికపై ముఖ్యమంత్రి మాట్లాడించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటల్లో చెప్పాలంటే రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ లేకుంటే రాష్ట్రం ఏమైపోయేదో, పి4 లాంటి కార్యక్రమాలు వచ్చేవా? అని ప్రజలకు ప్రశ్నలు వేశారు. ఇంతవరకు బాగానే ఉంది. వేదిక మీద పిలిపించుకొని మాట్లాడిన పేద కుటుంబాలు%కాదు కాదు%బంగారు కుటుంబాల ప్రతినిధులైన గొర్రెల కాపరి నరసింహ స్వామి, భవన నిర్మాణ కార్మికుడు ఇస్మాయిల్ పలు ప్రశ్నలను లేవనెత్తారు. తమ కుటుంబమంతా కష్టపడినా కడుపు నిండా కూడు తినలేని దౌర్భాగ్యకరమైన పరిస్థితికి కారణమేంటని నరసింహస్వామి ప్రశ్నిస్తే% కుటుంబం గడవడానికి, ఆడబిడ్డను చదివించడానికి ఇస్మాయిల్, ఆయన కుమారుడు మొత్తం కుటుంబం కష్టపడుతున్నా చాలీచాలని పరిస్థితులు, బిడ్డకు ఫీజులు కట్టలేని దయనీయమైన పరిస్థితికి కారణం ఏమిటో తెలియడం లేదని వాపోయారు. గొర్రెల కాపరి నరసింహ స్వామి, భవన నిర్మాణ కార్మికుడు ఇస్మాయిల్ పేదరికానికి ప్రభుత్వ బాధ్యత లేదా?

జగన్మోహన్ రెడ్డి హయాంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉండేదని, ఇప్పుడు తమతో సమానంగా ఆ కార్మికుడిని కూర్చోపెట్టుకున్నామని పవన్ కల్యాణ్ గొప్పగా ప్రకటించారు. జగన్మోహన్ రెడ్డి హయాంకి ఇప్పటికీ భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో ఏమైనా మార్పు వచ్చిందా? అన్నదానికి సమాధానం లేదు. ఇస్మాయిల్ భార్య, నరసింహస్వామి భార్య ఇరువురూ ఇంటి పనులతో పాటు, పూలు కడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వేదిక మీదకి పిలిచి మాట్లాడించుకున్న పేద కుటుంబాల్లోని సభ్యులు అందరూ కష్టపడుతున్నారు. అయినా జీవించటానికి తంటాలు పడుతున్నారన్న విషయం వారి మాటల్లోనే వ్యక్తం అయింది. రాష్ట్రంలో ఈ పరిస్థితి కారకులు ఎవరు? రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు సంపన్నుడికైనా, సామాన్యుడికైనా ఒకటే. కొనుగోలు శక్తి లేని వారి కష్టం గురించి వారి మాటల్లో అర్థమయింది. సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు సంపన్నులను, పేదలను కూర్చోబెట్టి సుద్దులు చెబుతున్నారు. ప్రపంచం మొత్తం శోధించి ఎక్కడా లేని విధానాన్ని



ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశ పెట్టానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా ప్రకటించారు. చంద్రబాబు చెబుతున్నట్టు ఇదేదో కొత్త పథకం కాదు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలోకి వచ్చిన ప్రతిసారీ పెట్టుబడుదారుల పట్ల భ్రమలు కల్పించేందుకు పాలకులు చేసే పనులన్నీ ఇలాంటివే! రాష్ట్రంలో పేదరికంలో ఉన్న 30 లక్షల కుటుంబాల బాధ్యత సంపన్నులకు అప్పగిస్తున్నామని ప్రకటించి ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి వైదొలిగింది. సంపన్నుల దయాదాక్షిణ్యాలతో ఏ దేశంలోనైనా పేదరికం తొలగిందన్న ఉదాహరణ ఉందా? సంపద కూడబెట్టుకున్న వారిలో పరివర్తన ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చనే చంద్రబాబు సిద్ధాంతాన్ని గతంలో అనేకమంది వివిధ దేశాల్లో చెప్పి ఆచరణలో అది అమలు కాదని గ్రహించారు. అంబేద్కర్, వివేకానందుడు, అబ్దుల్ కలాం, ఎన్టీ రామారావుల గురించి చంద్రబాబు నాయుడు వివరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతవరకు బాగానే ఉంది.

ఆ తరువాత మెగా కృష్ణారెడ్డి, చలమలశెట్టి అనిల్ కుమార్, లోక్‌సభ సభ్యులలోనే అత్యంత సంపన్నుడైన పెమ్మసాని చంద్రశేఖర్, పవన్ కల్యాణ్, తనను కూడా ఆదర్శంగా తీసుకోవాలని చెప్పుకొచ్చారు. మెగా కృష్ణారెడ్డి వ్యాపార రంగంలో ఎలా బలపడ్డారు? అనే దానిపై అనేక వివాదాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ కాంట్రాక్ట్‌లో పైపుల కుంభకోణం, వందల, వేల అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో, ఆయనకు ఉన్న ప్రైవేటు విమానాలు రాజకీయ నేతలకు ఉపయోగ పడుతున్న తీరు, కిర్లోస్కర్ కంపెనీకి సబ్ కాంట్రాక్టర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి అదే కిర్లోస్కర్ కంపెనీ ఆయనకు సబ్ కాంట్రాక్టర్‌గా మారిన తీరు, మెడికల్ విద్యార్థుల నుంచి అడ్మిషన్ల పేరిట వసూళ్లు తదితర అనేక వివాదాల్లో కూరుకుపోయి ఉన్నారు.


ఇక చలమలశెట్టి అనిల్ కుమార్ తెలంగాణ రాష్ట్రంలో ఈ రేస్ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్నారు. ఆయన స్థాపించిన గ్రీన్ కో ఎనర్జీ సంస్థ పలు వివాదాల్లో కూరుకుపోయి ఉన్నది. కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన ఈ అనిల్ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వివాదాస్పదమైన కార్పొరేట్ వ్యక్తి. అవినీతి కేసుల్లో ఇరుక్కున్నారు. ఈ ఇరువురు పారిశ్రామికవేత్తలు అధికారంలో ఏ పార్టీ ఉన్నా తమ పనులను జరిపించుకోవడంలో ఘనులు. ఇలాంటి ఘనమైన పేరున్న వివాదాస్పదమైన వ్యక్తులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తమతో సమానంగా వేదికపై ఆసీనులను కావించటం, వారి ద్వారా రాష్ట్రంలో పేదరికం నిర్మూలిస్తామని చెప్పడం ఏ మేరకు సమంజసమో వారే చెప్పాలి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి 600 మంది మార్గదర్శకులలో వివాదం లేని వ్యక్తులను వేదిక మీదకు పిలిపించుకోవటానికి జాగ్రత్త తీసుకుని ఉండాల్సింది. ఆ జాగ్రత్త తీసుకోకపోగా వీరినే ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రకటించటం% రాజకీయ నాయకులకు కార్పొరేట్‌కున్న బంధాన్ని మరో మారు వెల్లడి చేసింది. తమతో సమానంగా రెండు గంటలపాటు ఓ గొర్రెల కాపరిని, భవన నిర్మాణ కార్మికుడిని కూర్చోబెట్టుకొని రాష్ట్రమంతా ఇలానే ఉన్నట్టుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. వాస్తవంగా పేదలంటే లెక్కలేనితనం రాష్ట్రంలో అడుగడుగునా కనిపిస్తుంది. పేదలు రెవెన్యూ కార్యాలయాల్లో అడుగు పెట్టడానికి వీల్లేదు. పోలీస్ స్టేషన్లో వీరికి జరుగుతున్న అవమానాలు లెక్కలోనివి కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో వీరికి ఎదురవుతున్న అనుభవాలు ఒకటి రెండు కాదు. పేదలకు సాయం చేయకపోతే పోయింది. కనీసం వారిని మనుషులుగా చూసే పరిస్థితినైనా రాష్ట్రంలో తీసుకు రావడానికి ఏం చేయాలో నేతలు ఆలోచించడం మంచిది. బంగారు పేరులోనే కాదు ఆచరణలోనూ రావాలి.

# ఆరు - ముప్పయి ఆరు - అరవై ఆరు



'బుజ్జీ! ఏం చేస్తున్నావు? ఇందాక నీతో ఆడుకోవడం కోసం చిట్టి వచ్చింది' అని పిలిచింది రాధ. లోపల నుండి జవాబు రాలేదు. 'బుజ్జీ బుజ్జీ' మళ్ళీ గట్టిగా పిలిచింది. 'బుజ్జీ! మాట్లాడవేంటి?' వంటగదిలో నుండి హాల్లోకి వచ్చింది రాధ. బుజ్జి కుర్చీలో కూర్చుని తల్లి ఫోన్‌లో ఫిల్మీ మోజీ చూస్తూ పడీ పడీ నవ్వుకుంటుంది. అది చూడగానే రాధకు కోపం వచ్చింది. ' సమయం దొరికితే చాలు ఫోన్ పట్టుకుంటావు. మీ టీచర్ నువ్వు 'ఇది వరకటంత బాగా చదవడం లేదు'ని చెప్తున్నారు. ఫోన్ పక్కన పెట్టి కాసేపు చదువుకోవచ్చు కదా?' ఫోన్ లాక్కుంటూ అంది రాధ. అమ్మా! ప్లీజ్ అమ్మా! హోమ్ వర్క్ ఏమీ లేదు అన్నీ రాసేసాను. ప్లీజ్! కాసేపు ఫోన్ చూస్తాను' అంటూ రాగం తీసింది బుజ్జీ. 'హోమ్‌వర్క్ లేకపోతే ఆడుకోవచ్చుగా! ఇందాక నీ కోసం చిట్టి వచ్చింది' ఫోన్ ఇవ్వకుండా అంది రాధ. 'అబ్బా పోమ్మా! చిట్టితో కాసేపాగి ఆడుకుంటాను' అని రాగం పెద్దది చేసింది బుజ్జీ. 'నిన్ను మార్చడం నా వల్ల కావడం లేదు. పది నిముషాల తర్వాత నువ్వు ఫోన్ ఆపేసి ఆడుకోవడానికి వెళ్ళాలి సరేనా!' అంటూ ఫోన్ ఇచ్చింది రాధ. తిరిగి వంటగదిలోకి వెళ్ళబోతున్న రాధ చూపు బెడ్‌రూమ్ వైపు పడింది. అడుగులు అటువైపు వేసింది. గోపాల్ మంచం మీద పడుకుని తదేకంగా ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. రాధ గదిలోకి రావడం కూడా పట్టించుకోలేదు. 'ఏవండీ? ఏం చేస్తున్నారు? రోజూ ఎలాగూ కుదరదు. కనీసం ఆదివారం రోజైనా ఇంటి విషయాలు పట్టించుకోవచ్చుగా?' దగ్గరకు వచ్చి అడిగింది రాధ. 'ఆదివారం ఒక్కరోజు సెలవు దొరికేది. ఏదో సరదాగా ఫోన్ పట్టుకుంటే ఏంటి నీ గొడవ?' విసుక్కున్నాడు గోపాల్. 'ఆ ఒక్కరోజూ నా కోసం, పాప కోసం కూడా వెచ్చించాలి కదండీ?' సౌమ్యంగా అంది రాధ. 'అనవసరంగా నన్ను విసిగించకుండా వెళ్ళు' కసురుకున్నాడు గోపాల్. రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అక్కడ నుండి బయటకు వచ్చేసింది. అప్పుడే పక్కగదిలో నుండి నవ్వు వినిపించి అటు చూసింది. మంచం పక్కనున్న కుర్చీలో వెనక్కు తిరిగి కూర్చున్న రామారావు ఫోన్‌లోకి చూస్తూ పెద్దగా నవ్వుతున్నాడు. రాధ గదిలోకి రెండడుగులు వేసింది. తన్మయత్వంగా రీల్స్ చూస్తున్న ఆయన ఆమె అలికిడి వినిపించుకునే స్థితిలో లేడు. రెండు నిముషాలు అక్కడే నిలబడి బయటకు వచ్చేసింది. ఆమె మనసంతా తీవ్రమైన బాధతో నిండిపోయింది. 'ఈ ఇంట్లోని మనుషులకు ఏలా చెప్పాలి? ఎలా మారతారు?' అనుకుంటూ ఆమె కళ్ళలో నుండి నీళ్ళు ధారలుగా కారిపోతున్నాయి. చూపు మసకబారి, కూరగాయలు కోస్తున్న చాకు వేలి మీద బలంగా పడింది. అంతే! రక్తం చివ్వున చిమ్మింది. ఒక్కసారిగా స్పృహలోకి వచ్చి అందుబాటులో ఉన్న గుడ్డ తడిపి చేతికిచుట్టింది. కానీ రక్తం ఆగడం లేదు. చెయ్యి అలాగే పట్టుకుని భర్త దగ్గరకు వచ్చి 'ఏవండీ' అని పిలిచింది. 'రాధా! మరో గంట వరకు నన్ను డిస్టర్బ్ చేయొద్దని ఎన్నిసార్లు చెప్పాలి' తల తిప్పకుండానే గట్టిగా అరిచాడు గోపాల్. అవమానంతో అక్కడ నుండి మామగారి దగ్గరకు వచ్చింది. 'మావయ్య గారు!' మెల్లిగా పిలిచింది రాధ. ఆయన వెనక్కు చూడకుండానే 'కాసేపాగి భోజనం చేస్తానమ్మా!' అన్నాడు. రాధ మౌనంగా అక్కడ నుండి హాల్లోకి వచ్చింది. బుజ్జీ సర్వం మరచిపోయి ఫోన్ చూస్తోంది. ఆమె వేలి నుండి రక్తం ఆగకుండా కారిపోతుంది. చిన్నప్పటి నుండి రక్తం చూస్తే రాధకు కళ్ళు తిరుగుతాయి. అందులో ఆమె చేతి నుండి వస్తున్న రక్తం చూసేసరికి కళ్ళు తిరిగి సోఫాకి ఆనుకుని 'అమ్మా' అంటూ నేల మీదకు వాలిపోయింది. ఆ అరుపుకి బుజ్జి తలెత్తి చూసింది. వెంటనే 'అమ్మా%' అని పరుగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వచ్చింది. అప్పటికే రాధకు మైకం కమ్మినట్లు అనిపించింది. 'డాడీ% డాడీ' అని ఏడుస్తూ అరిచింది బుజ్జీ. గోపాల్, రామారావు ఇద్దరూ ఫోన్లు పట్టుకునే అక్కడకు వచ్చారు. నేల మీద పడున్న రాధను, ఆమె చేతి నుండి కారుతున్న రక్తాన్ని చూసి కంగారుపడ్డారు. గోపాల్ రక్తం కారుతున్న చేతి వేలుని గుడ్డతో నొక్కి పట్టుకున్నాడు. రామారావు గ్లాసుతో నీళ్ళు తెచ్చి కోడలి ముఖాన చిమ్మాడు. రాధ కళ్ళు తెరిచి భర్తను, మామగారిని, ఏడుస్తున్న కూతురిని చూసింది. 'రాధా! అసలేమైంది?' అన్నాడు గోపాల్. 'కూరగాయలు కోస్తుంటే వేలు తెగింది. 'ఇంత రక్తం పోతుంటే పిలవొచ్చుగా గోపాల్, రామారావు ఇద్దరూ ఒక్కసారే అన్నారు. 'పిలిచాను కానీ' వాళ్ళను చూస్తూ ఆపేసింది రాధ. ఇద్దరి ముఖాలలో రంగులు మారిపోయాయి. జరిగింది గుర్తు చేసుకున్నారు. ఇంత జరిగినా కోప్పడని రాధ మంచితనాన్ని వారు అర్థంచేసుకున్నారు. పలుచబడుతున్న కుటుంబ బంధాలకు కారణమైన ఫోన్ వైపుకి చూసారు. 'గోపాల్!అమ్మాయిని ఆస్పత్రికి తీసుకెళ్ళు. వంట సంగతి నేను చూసుకుంటాను. బుజ్జీ! నువ్వు నాతో రా!. మనం కబుర్లు చెప్పుకుంటూ పని చేద్దాం' అన్నాడు రామారావు.రాధ ముఖంలో మునుపటి నవ్వు వికసించింది.

## ప్రొటీన్ ఫుడ్‌తో
# టీబీ దూరం



రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు టీబీ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో, వైరస్, బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా శరీరాన్ని బలోపేతం చేయడంలో ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. టీబీ ఉన్నవారు బరువు తగ్గడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో బరువు కోల్పోకుండా టీబీ రోగులు అధిక కేలరీలు, పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి. విటమిన్ ఎ, సి, ఈ, డి వంటి విటమిన్లు ఆరోగ్యకరమైన రోగ నిరోధక వ్యవస్థకు కీలకం. ఇవి డ్రైఫ్రూట్స్, నట్స్, పుట్టగొడుగులు, క్యారెట్ వంటి వాటిల్లో సమృద్ధిగా లభిస్తాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే టీబీ నుంచి బయట పడొచ్చు. మరి వాటిని ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందాం.

క్యారెట్ హల్వా

కావాల్సినవి : క్యారెట్ – కిలో, బెల్లం– రెండు కప్పులు, నెయ్యి– కావాల్సినంత, యాలకుల పొడి– స్పూను, డ్రై ఫ్రూట్స్–కప్పు, చిక్కటిపాలు– అర గ్లాసు.

తయారీ : క్యారెట్‌ను చెక్కు తీసి, సన్నగా తురుముకోవాలి. అడుగు మందంగా ఉన్న కడాయిని స్టవ్ మీద పెట్టాలి. మంట సిమ్‌లో ఉంచి, నెయ్యి వేసి, వేడయ్యాక క్యారెట్ తురుము వేసి మూతపెట్టాలి. క్యారెట్ ఓ ఐదు ఆరు నిమిషాలకు మెత్తగా ఉడుకుతుంది. అడుగంటకుండా కలుపుతూ ఉడికించాలి. బెల్లం వేసి గరిటెతో కలయతిప్పాలి. పాలు కూడా పోసి, దగ్గరకు వచ్చాక నెయ్యి వేసి కలపాలి. చిన్నమంట మీద బాగా ఉడకనివ్వాలి. హల్వా గట్టి పడిన తర్వాత కడాయి దించి, పక్కన పెట్టుకోవాలి. అందులో యాలకులపొడి, వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసుకోవాలి. అంతే ఏంతో ఆరోగ్యకరమైన క్యారెట్ హల్వా రెడీ.

# పూలల్లో జిగేల్ రాణి.. జిన్నియా..



జిన్నియా అనేది ఆస్టరేసి కుటుంబంలోని హెలియాంథియే తెగకు చెందిన మొక్కల జాతి . ఇవి మెక్సికోలో వైవిధ్యానికి కేంద్రంగా ఉన్న నైరుతి యునైటెడ్ స్టేట్స్ నుండి దక్షిణ అమెరికా వరకు విస్తరించి ఉన్నాయి. ఇవి వివిధ రకాల ప్రకాశవంతమైన రంగులలో కనువిందు చేస్తాయి. గుత్తంగా.. రేకగా.. పూలు విరబూస్తాయి. రెండు, మూడు రంగుల మేళవింపుతో కలబోత రంగులతో మనసును దోచేస్తాయి. వీటిని బంగాళా బంతి అని కూడా పిలుస్తారు. ఇవి బంతిలాగానే పూలు ఎండిపోయాక పూల రేకులే విత్తనాలుగా మొలకెత్తుతాయి. వీటిని ముందుగా నారు పోసుకుని, నాటుకోవాలి. ఇవి నేలలో మనిషిని మించిన ఎత్తుకూ ఎదుగుతాయి. కుండీల్లో ఒద్దికగానూ పెరుగుతాయి. పూలు మాత్రం మంచి మంచి రంగుల్లో ముద్దగా.. ముద్దులొలుకుతూ పసిపాప నవ్వులా బాగుంటాయి.

# యోగాతో అనేక ప్రయోజనాలు



**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రపాలిత ప్రాంతం యానంలో ప్రభుత్వ ఐటిఐ లో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో డాక్టర్ జయవీరన్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ లెక్చరర్ డాక్టర్ జయ వీరన్ అన్నారు. ప్రత్యేక శిబిరంలో శిక్షణలో భాగంగా విద్యార్థులకు యోగ పై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ సిహెచ్ కృష్ణ సుధాకర్, వి ఆనంద్, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## యానాం కవి దాట్ల దేవానందం రాజుకు
# కళారత్న పురస్కారం


**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉగాది అవార్డులు అందిస్తున్న నేపథ్యంలో కేంద్ర పాలిత ప్రాంతం యానంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవానందం రాజు సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్నహంస పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దేవానందం రాజుకు కళా రత్న పురస్కారంతోపాటు 50 వేల రూపాయల నగదు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారత్న పురస్కారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేవానందం రాజుని పలువురు కవులు ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, యానంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రముఖులు అభినందించారు.

## ఆర్ అండ్ బి చెట్ల అక్రమ నరికివేతపై
# తాహసిల్దార్ విచారణ

**ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలపై తాహసిల్దార్ ఆగ్రహం.. చెట్ల దొంగతనం పై ఎఫ్.ఐ.ఆర్. వేయించాలని డిమాండ్**

**కొలిక్కి రాని విచారణ - మరోసారి జరిగే అవకాశం**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరం – నెల్లిపూడి గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రోడ్డుకు రెండు పక్కలా భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం నుండి సజీవంగా ఉన్న నిద్రగన్నేరు, మర్రి, తాడి రకాలకు చెందిన కొన్ని చెట్లను ఈ ఏడాది ఫిబ్రవరి 7 వ తేదిన నెల్లిపూడికి చెందిన నలుగురు అక్రమంగా నరికి సొమ్ము చేసుకున్న దొంగతనంపై “వాల్టా” చట్టం ప్రకారం శంఖవరం మండల తాహసిల్దార్ అల్లాడి తాతారావు తన కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం విచారణ చేపట్టారు. చెట్లను అక్రమంగా నరికి, అక్రమంగా తరలించుకు పోయి అమ్మి సొమ్ము చేసుకున్న నేరంపై విచారణ చేపట్టాలని కోరుతూ అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ శాఖలకూ జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు, శంఖవరం జనసేన పార్టీ అధ్యక్షుడు మేకల కృష్ణ 10 తేదీన ఫిర్యాదు చేసారు. అమరావతి జనసేన పార్టీ కార్యాలయం జనవాణీలోనూ ఫిర్యాదు చేశారు. ఐనప్పటికీ ఆయా యంత్రాంగాలు చర్యలు చేపట్టక పోడంతో చివరకు శంఖవరం మండల వాల్టా చట్టం కమిటీ ఎక్స్ఆఫిషియో చైర్మన్ ఐన శంఖవరం మండలం తహశీల్దారు అల్లాడి తాతారావు, శంఖవరం మండల వాల్టా చట్టం ఎక్స్ ఆఫిషియో వైస్ చైర్మన్ ఐనా శంఖవరం ఎంపీడీవో ఎస్.సుబ్బు శర్మలకు మార్చి 24 న మరోసారి మేకల కృష్ణ ఫిర్యాదు చేశారు. ఫలితంగా తాహసిల్దార్ తాతారావు, ఇంఛార్జి ఎంపీడీవో. ఎన్.ఎం.కె.జి. ప్రసాద్ నేటి ఈ విచారణ చేపట్టారు. ఆర్ అండ్ బి శాఖ తరపున తుని ఏఈ. రజని, వర్క్ ఇన్స్పెక్టర్



కామేశ్వరరావు, విద్యుత్ శాఖ తరపున ఏఈ. భగతి కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ నాయుడు ప్రతివాదులుగా విచారణకు హాజరు అయ్యారు. నీరు, భూమి, వృక్షాల రక్షణ, సంరక్షణకు 2002లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన “వాల్టా” ప్రత్యేక చట్టాన్ని ఫిర్యాదీ మేకల కృష్ణ తొలుత తన వాదనలు వినిపించారు. ఆ చట్టం ప్రకారం ప్రభుత్వ చెట్లను నరకాలంటే అటవీ, పర్యావరణ, రెవిన్యూ తదితర ప్రభుత్వ శాఖల అనుమతులు ఉండాలనీ, కానీ ఇక్కడ అవి లేవనీ, ఏ అనుమతులూ లేకుండానే నెల్లిపూడి–శంఖవరం గ్రామాల మధ్య చెట్లకు దగ్గరగా విద్యుత్ శాఖ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసిందనీ, తీగలకు చెట్లు అడ్డు వస్తాయనే నెపంతోనే దొంగలు చెట్లను పట్టపగలే అక్రమంగా నరికేసారని, తద్వారా పర్యావరణానికి, ప్రయాణీకులకు హాని కలిగించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం కలిగించారనీ, ఈ రెండు గ్రామాల మధ్య కలప మాఫియా ఒకటి రాజ్యం తోలుతోందని తన వాదనను వినిపించారు. అనంతరం విచారణలో తాహసిల్దార్ అడిగిన పలు ప్రశ్నలకు ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు వివరణలు ఇచ్చారు. దొంగలు ఎవరో తమకు తెలియదని, ఆ సమయంలో తాము వేరే విధుల్లో ఉన్నందున దొంగలను చూడలేదని ప్రతివాదులు బదులివ్వగా తాహసిల్దార్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగతనంపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేసి మిన్నకుండి పోవడం, దొంగలు ఎవరో తెలుసుకొనక పోవడాన్ని తాహసిల్దార్ తప్పు పట్టారు. గ్రీన్ ట్రిబ్యునల్ కేసు అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదని సుతిమెత్తగా హెచ్చరించారు. విచారణ కొలిక్కి రాలేదు. దీంతో చెట్ల అక్రమ నరికివేత, దొంగతనంగా తరలింపు, అమ్మకం వంటి విషయాలపై పోలీసు శాఖ వద్ద ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయించాలని ఫిర్యాదీ మేకల కృష్ణ పట్టుబట్టారు. ఎఫ్.ఐ.ఆర్. నమోదైతే ఆపైన తాను న్యాయస్థానంలో తేల్చుకుంటానని నిర్లక్ష్యపు ప్రభుత్వ అధికార్లకు, చెట్ల దొంగలకు మేకల కృష్ణ సవాల్ విసిరారు. విచారణ ఇంకా పూర్తి కాలేదనీ, అధికారులు తమ తమ రాతపూర్వక వాంగ్మూలాలను ఇవ్వాలనీ, ఇంకా రెండు, మూడు దశల విచారణ కొనసాగే అవకాశం ఉందని, అప్పటికి గానీ పూర్తి విషయం తేలదని “విశ్వం వాయిస్” విలేకరి జక్కల నాగసత్య నారాయణ ప్రశ్నకు బదులుగా తాహసిల్దార్ అల్లాడి తాతారావు వెల్లడించారు.

## చమురు సంస్థ ఇంటింటికి
# ఉచితంగా గ్యాస్ ఇవ్వాలి

**విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు**



**తాళ్ళరేవు, సుంకరపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళ్ళరేవు మండలంలో ఉన్న రెండు చమురు సంస్థల నుండి మండల పరిధిలోని ప్రతి ఇంటికి ఉచితంగా గ్యాస్ ఇవ్వాలని విశ్వజన కళామండలి అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాడిమొగలోని రిలయన్స్, పి మల్లవరం పంచాయతీ పరిధిలోని ఓ ఎన్ జి సి సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని, మండల ప్రజలను పట్టించుకోకుండా ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఈ కంపెనీలు సహకారాలు అందిస్తున్నాయని, సంస్థల వల్ల గాడిమొగ, పి మల్లవరం, పోలేకుర్రు, జార్జి పేట,నీలపల్లి, తాళ్ళరేవు మండల పరిధిలోని ఈ గ్రామాలు కాలుష్యం బారిన పడుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతాలలోని ఆకుపచ్చని చెట్లు నల్ల రంగులో మారి కొబ్బరి చెట్లు సైతం ఉత్పత్తి తగ్గుతున్నాయని, ఈ గ్యాస్ కంపెనీల వల్ల ప్రజలు నష్టపోవడమే కాకుండా పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, తక్షణమే చమురు సంస్థలు స్పందించి మండలంలోని ఈ గ్రామాలకు ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సరఫరా చేయడంతో పాటు ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# శంఖవరం ఎంపీడీవోగా ప్రసాద్ నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల ప్రజా పరిషత్తు పూర్తి అదనపు బాధ్యతల అభివృద్ధి అధికారిగా నూనె మురళీకృష్ణ గంగాధర్ ప్రసాద్ నియమితులు అయ్యారు. ఇప్పటి వరకు శంఖవరం ఎంపిడిఓగా సుమారు 8 నెలల కాలం పాటు విధులను నిర్వహించి సామర్లకోటలోని ఈటిసికు బదిలీపై వెళ్లిన ఎస్.సుబ్బుశర్మ స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల అభివృద్ధి అధికారిగా ప్రసాద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రసాద్ ఇదే శంఖవరం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో గత కొంత కాలం నుంచి కార్యాలయ పరిపాలన అధికారిగా విధులను నిర్వహిస్తూ ఉన్నారు.దీనితో పలు శాఖల సిబ్బంది ఎంపిడిఓ ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ప్రభుత్వం నెలనెలా అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పింఛన్ దారుల గృహాల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పంచాయతీ నాయకులు జక్కల ప్రసాద్ బాబు, సాధనాల వెంకట శివరామకృష్ణ, వూడా రాంబాబు, పోతుల విజయభాస్కర్, వడ్లమూరి సతీష్, దున్నా సింహాద్రి, జె ఈశ్వరరావు, ఆర్ గోవరాజు, మోర్త సత్యనారాయణ ఇతర పంచాయతీ పరిధిలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## జేగురుపాడులో ఉపాధి హామీ పనులు ప్రారంభం



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం జేగురుపాడులో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభ రోజైన మంగళవారం ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ముత్యాలమ్మ గుడి నుండి మురమండ వంతెన వరకూ వెయ్యి మీటర్ల కాలువ పూడికతీత పనులను ఆ గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరు రాజేష్, ఎంపిటీసి నాగిరెడ్డి సూర్య రామకృష్ణ లు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి మర్రెడి రమేష్,పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ, కూటమి నాయకులు కర్రి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ
# ప్రారంభించిన మంత్రి సుభాష్

**ఏడాదిలో లక్షా 75 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలు లక్ష్యం : మంత్రి వాసంశెట్టి సుభాష్**



**కాజులూరు, విశ్వంవాయిస్ న్యూస్:** మహిళా పారిశ్రామిక వేత్తలే లక్ష్యంగా రాష్ట్రంలో ఏటా లక్ష 75 వేల మంది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించడమే , కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మహిళల్లో ఆత్మ గౌరవం,ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాజులూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ, వినికిడి యంత్రాల పంపిణీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ, ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మహిళలలో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు. రామచంద్ర పురం నియోజకవర్గంలో బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ వెల్ఫేర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 6 ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే రామచంద్రపురంలో 2 కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఒక్కో కేంద్రంలో 120 మంది 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల మహిళలకు 3 నెలలపాటు (90 రోజులు )కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులు బ్యాచుల వారీగా ఉదయం, సాయంత్రం ఇస్తామన్నారు. కుట్టు మిషన్ నేర్చుకునే మహిళలు ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ కేంద్రానికి హాజరయ్యే మహిళలకు ప్రతిరోజు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం జరుగుతుందని, కనీసం 75 శాతం హాజరు కలిగిన మహిళలకు శిక్షణ చివరి రోజున కుట్టు మిషన్ ఉచితంగా ఇవ్వడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే జిల్లావ్యాప్తంగా ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి కుట్టడానికి బట్టల ఆర్డర్లు శిక్షణ పొందిన మహిళలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ కోర్సుల కూడా ఉచితంగా నేర్పిస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో భర్తలను కోల్పోయిన వారు సుమారుగా 180 మంది వరకు గుర్తించామని అన్నారు. వీరిచేత చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని, 40 సంవత్సరాల లోపు వితంతువులకు ఎంబ్రాయిడరీ కోర్స్ ఉచితంగా నేర్పిస్తూ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా రోజుకు రూ.300 రూపాయలు వేతనం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో కూడా మహిళలకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించడానికి ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలో రామచంద్రపురం పట్టణంలోని వీఎస్ఎం కళాశాలలో నియోజకవర్గంలోని పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ శ్రీనివాస్, జిల్లా సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి పి వేణుగోపాలరావు, కాజులూరు తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీవో రాంబాబు, అలింకో ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం



**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్:** కార్పొరేట్ కళాశాలలకు కూటమి ప్రభుత్వం కొమ్ము కాస్తుందని ఎస్ఎఫ్ఐ ధ్వజ మెత్తింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం జిఒ విడుదల చేయడం దారుణమని మండిపడింది. బుధవారం ఎస్ఎఫ్ఐ బృందం నగరంలోని పిఆర్ ఒకేషనల్, ఉమెన్స్ జూనియర్ కళాశాలల్లో సర్వే చేసింది. ఈ సందర్భం గా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, జిల్లా కమిటీ సభ్యులు విపిన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలకు అనుకూలంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ కళాశాల ప్రారంభించడం కోసం జిఒ ఇవ్వడం వెనుక కార్పొరేట్ కళాశాలల ప్రయోజనాలు దాగి ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోసం కాకుండా కార్పొరేట్ కాలేజీల సమ్మర్ క్లాసుల నిర్వహణకు అవకాశం కల్పించేలా ఈ జిఒ ఉందన్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ హెచ్చరికలను పక్కన పెట్టి ఎటువంటి సౌకర్యాలు లేకుండా కళాశాల నిర్వహించడం అంటే విద్యార్థుల ప్రాణాలను గాలికి వదిలేసినట్టే అని విమర్శించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎండ వేడిమి భారిన పడే అవకాశం ఉందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీన పరీక్షలు పూర్తయ్యాయని, ఆ పరీక్షల ఫలితాలు రాకుండా ఇంటర్ తరగతులు, అడ్మిషన్ల కోసం ప్రభుత్వం జిఒ విడుదల చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. నేటి విద్యా వ్యవస్థను మొత్తం ప్రయి వేట్, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే కూటమి ప్రభుత్వం ఈ జిఒ ఇచ్చిందని విమర్శంచారు. తక్షణమే విద్యా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని వారు డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



**నల్లజర్ల, విశ్వంవాయిస్ న్యూస్** : నల్లజర్ల నుండి పోతవరం వెళ్లే రోడ్డులో హైవే బ్రిడ్జి వద్ద మోటార్ సైకిల్ ను ఢీకొన్న లారీ ఈ ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ఏలూరుకు చెందిన బత్తుల రమణమ్మ ఆమె కుమార్తె మాధవి కలసి బుధవారం ఉదయం స్కూటర్ పై బయలుదేరి తూర్పుగోదావరి పసివేదల గ్రామం వెళుతూ మార్గమధ్యంలో నల్లజర్ల చేరుకునే సరికి హైవేపై వాహనాలు అధిక స్పీడ్ తో వెళతాయని భయంతో పక్కనే ఉన్న సర్వీస్ రోడ్ నుంచి వెళ్తూ ఉండగా పోతవరం నుండి నల్లజర్ల వెళుతున్న లారీ వేగంగా వచ్చి మాధవి రమణమ్మ వెళుతున్న స్కూటీని ఢీకొట్టింది. వెనుక కూర్చున్న రమణమ్మ కాలు లారీ చక్రాల కింద పడి నుజ్జు నుజ్జు అయింది. వెంటనే నల్లజర్ల 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికుల సహాయంతో పోలీసులు తరలించారు.

# నన్నయ్య యూనివర్సిటీలో ఉగాది పురస్కారాన్నీ అందుకున్న షేక్ బాజ్జి



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం స్థానిక నన్నయ్య యూనివర్సిటీలో 2025 సంవత్సరం ఉగాది పురస్కారల్లో భాగంగా నన్నయ్య యూనివర్సిటీ యూ.జే ఎగ్జామినేషన్ విభాగం నుంచి షేక్ బాజ్జి కు యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న షేక్ బాజ్జి కి పురస్కారం అందుకోవడం అభినందనీయని రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ , ఫార్మర్ వైస్ చాన్సలర్ కచ్చా జార్జ్ విక్టర్ తదితర యూనివర్సిటీ సిబ్బంది అన్నారు.



## వీరభద్రరావు మచ్చలేని రాజకీయ
# జీవితాన్ని జీవించారు

**రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందులదుర్గేష్**

**గొప్ప సాహిత్యవేత్త పోతుల వీరభద్రరావు 26వ వర్ధంతి సభలో అత్యంత వైభవంగా నివాళి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ శాసనసభ్యులు,మాజీ మున్సిపల్ చైర్మన్, అజాతశత్రువు పోతుల వీరభద్రరావు 26వ వర్ధంతి సభ స్థానిక టౌన్ హాల్లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమ ంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ టూరిజం శాఖ మంత్రి కందులు దుర్గేష్ పాల్గొని వీరభద్ర రావు గురించి ఆయన చేసిన సేవలు గురించి ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ వీరభద్రరావు మచ్చలేని రాజకీయ జీవితాన్ని జీవించారని అనేక సాహిత్య కార్యక్రమాలలో పాల్గొని గొప్ప గొప్ప కవీశ్వరుల చేత మెప్పు పొందిన గొప్ప సాహిత్య వేత్తని, ఆయన ఫుట్బాల్ క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబరిచి అనేక అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడమే గాక నిర్వహించారని, అందుచేత ఆయన పేరు రాజమండ్రి మున్సిపల్ స్టేడియంకు నామకరణం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు సత్తి పెదగంగిరెడ్డికి, ప్రముఖ సాహిత్య వేత్త వి.వి సుబ్రహ్మణ్యం కు, ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారులు సింగారం భాస్కర్ కు, లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాదర్ ఖాన్ కు ట్రస్టు తరుపున ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమానికి పోతుల వీరభద్ర ట్రస్ట్ అధ్యక్షులు బి విఎస్ మూర్తి అధ్యక్షత వహించగా, మాజీ డిస్టిక్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలనాయుడు, ట్రస్ట్ సభ్యులు మేడా గురుదత్ ప్రసాద్ పాల్గొని వీరభద్ర రావుకి నగరంతో ఉన్న అనుబంధాన్ని ఆయన చేసిన సేవా కార్యక్రమాలను సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు జగన్నాథం వెంకటరెడ్డి రాజు,తోట సుబ్బారావు, బేరులాల్ జైన్,కూరగంటి సతీష్, అయ్యల గోపి, టౌన్ హాల్ లైబ్రేరియన్ వి.టి.వి.సుబ్బారావు మోర భరద్వాజ్,కర్రి సూర్యనారాయణ, మంచాల సునీల్,యర్ర రంగబాబు మరియు అనేకమంది పిఈటి సంఘం సభ్యులు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు నగర ప్రముఖులు పాల్గొని వీరభద్ర రావుకి నివాళులు అర్పించారు.


# దాతల సహకారంతో చలివేంద్రం



**చాగల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్ఆర్ఐ డైరెక్టర్ ఆతుకూరి వెంకటే శ్వరరావు సతీమణి ఉషారాణి పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ దాతలు ఆతుకూరి వెంకటేశ్వరరావు, ఉషారాణి దంపతులు సహకరించినట్లు ఉచిత మజ్జిగ పంపిణీ మధ్యాహ్నం దాతలు గ్రంధి వెంకటేశ్వరరావు, నాగ పర్వత వర్ధనమ్మ పెళ్లిరోజు సందర్భంగా వారి కుమారులు మానవత ట్రజరర్ గ్రంధి సుబ్బారావు గుప్త వారి కుటుంబ సభ్యులు మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.రామచంద్రారెడ్డి సందేశ స్ఫూర్తితో బాటసారుల దాహార్తిని తీరుస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న చలివేంద్రం సహకారంతో 4వ రోజు మరియు ఉచిత మజ్జిగ పంపిణీ 3 వరోజు మానవత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో బుధవారం మారీజియన్ ఛైర్ పర్సన్ జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ ఛైర్ పర్సన్ బోయపాటి రామలక్ష్మి దంపతులు పాల్గొన్నట్లు ట్రస్ట్ చైర్మన్ జజ్జువరపు వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు . దాతలు సహకారంతో వర్షాకాలం వచ్చేవరకు మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# పశువులకు త్రాగునీటి కోసం నీటితొట్లు ఏర్పాటు

**శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలోని రాజానగరం మండలం కలవచర్ల గ్రామంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వేసవిలో పశువులకు తాగునీటి కోసం నీటి తొట్టెలుకు శంకు స్థాపన చేసినట్టు ఆయన తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో వేసవి లో పశువులకు త్రాగునీటి కోసం నీటి తొట్టెలు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మిస్తున్నామని, పశువుల యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు త్రాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జేప ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు, ఎన్డీఏ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణల చెరలో ఊరచెరువు



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన ఊరచెరువు సర్వే నెంబర్ 51 లో 12 ఎకరాల 57 సెంట్లు విస్తీర్ణంలో ఉంది. సుమారు 50 ఏళ్లుగా వెలసిన ఆక్రమణల వల్ల సుమారు 3 ఎకరాలపైగానే కుచించుకుపోయింది. వర్షాలు కురిసినప్పుడల్లా సమీప ప్రాంతం ముంపు తప్పడం లేదు. చెరువు,కాలువల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులు విచారణ,నివేదికల పేరిట కాలం వెళ్లదీశారే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. సీతానగరం మండలంలోని రఘుదేవపురం ఊరచెరువు, కాలువల ఆక్రమణలపై కథనం. ఊరచెరువు ఆక్రమణలపై అధికార యంత్రాంగం మౌనం వీడటం లేదు. తటాకం పూర్తి స్థాయి నీటి మట్టం పరిధి,బఫర్ జోన్,కాలువలు వాటి బఫర్ జోన్లు గుర్తించినా,ఆ పరిధిలో వెలిసిన అక్రమణలపై చర్యలు శూన్యం. వెరసి ఊరచెరువు చుట్టూ భవన నిర్మాణాలు,వ్యర్థాలను పోస్తూ క్రమంగా స్థలాన్ని సృష్టించి ఆక్రమించే ప్రయత్నాలు రోజు రోజుకూ బాగానే సాగుతున్నాయి. రెవిన్యూ లెక్కల ప్రకారం సర్వే నంబరు 51లో ఊరచెరువు గతంలో 12.57 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఏళ్ల తరబడి ఆక్రమణలు,అక్రమ నిర్మాణాల వల్ల అది 9 ఎకరాలకే పరిమితమైంది. చెరువు నుంచి నీళ్లు బయటకు తీసుకువెళ్లే కాల్వలను సైతం అక్రమార్కుల చెరలో బందీ అయ్యాయి. వర్షాకాలంలో తటాకంలో నిల్వ ఉండాల్సిన నీళ్లు, పారే కాల్వలు లేక చుట్టుపక్కల కాలనీలను ముంచెత్తుతున్నాయి. అందుకు కారణం ఆక్రమణలేనని గుర్తించిన అధికారులు ప్రతిసారి సర్వే మాత్రమే నిర్వహించి మక్కులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. బఫర్ జోన్ ఆక్రమించి మరీ కట్టడాలు ఈ పరిధిలో 35 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బఫర్ జోన్లలో ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించినా సంబంధిత అధికారులు వాటిని

## పట్టించుకోని అధికారులు

దర్జాగా కట్టడాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు పైరవీలతో ముఖ్య నేతల్ని ఆశ్రయించి వాటి జోలికి రాకుండా చక్రం తిప్పుతున్నారు. ఆక్రమణలను పట్టించుకున్న నాథుడే కరవయ్యారని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. ఇటీవల కాలంలో నూతనంగా తన్నీరు రాజు,తన్నీరు నూకరాజు,తన్నీరు జయమ్మ,తన్నీరు రజని అనే వ్యక్తులు చెరువులో అక్రమంగా ఇల్లు నిర్మిస్తుండటం స్థానికుల్లో ఆగ్రహం కలిగిస్తోంది. ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ,వాటిని లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై ఇరిగేషన్,పంచాయతీ,రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా,వారు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చెరువులో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువులో నిర్మాణాలు చేపట్టడం ద్వారా ఎన్జీటీ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని,భవిష్యత్తులో వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంలో న్యాయస్థానం తక్షణమే జోక్యం చేసుకుని,చెరువు ఆక్రమణలను నిలుపుదల చేయాలని,అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

## పాశాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న
# నీరుకొండ వీరన్న చౌదరి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం ముగ్గుళ్ళ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ పాశాలమ్మ అమ్మవారి ఆలయం పునః ఆగమన ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో బిజెపి రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడి వెంకటరమణ, గూడపాటి జయరాం జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో
# రెచ్చగొట్టే పోస్టులు

**ఫిర్యాదు చేసిన విఆర్ఓ**



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల మరణించిన ప్రవీణ్ కుమార్ పగడాల అనే వ్యక్తి గురించి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీతానగరం విఆర్ఓ కండెల్లి అఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్స్టాగ్రామ్లో "పగడాలు పగిలిందా" అనే శీర్షికతో ఉన్న రీల్స్, ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ప్రవీణ్ కుమార్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించారని, ప్రజల మనోభావాలను దెబ్బతీసి, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులు పెట్టిన "పార్వతి ఆన్ ఇన్స్టాగ్రామ్" అనే ఖాతాదారుపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ పోస్టులను ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అఖిల్ కోరారు. ఈ మేరకు అఖిల్ అందించిన స్క్రీన్ షాట్స్, ఫోటోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనపై సీతానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా చూడాలి

**ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం : శాసనసభ్యులు బత్తుల**



**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** వేసవికాలంలో నియోజకవర్గంలోని ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజమహేంద్రవరం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ పనుల పురోగతిపై ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలో ప్రజలకు త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, అధికారులు అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కూనవరం,గాదరాడ,కనుపూరు గ్రామాలలో మంచినీటి సమస్యపై ఆయన సమీక్షించి, త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో మంచినీటి సమస్యను పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముగ్గళ్ళ వాటర్ ట్యాంక్ కి 24 గంటల విద్యుత్ సరఫరా,ఇనగంటివారిపేట కరెంటు సమస్యపై విద్యుత్ శాఖ %ూణజు% (కన్స్ట్రక్షన్)తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంబుపట్నం,నరసాపురం, ముక్కినాడ పాకలు, మల్లంపూడి, తోకాడ, పాత తుంగపాడు,రామేశంపేట,దివాన్ చెరువు, మిర్తిపాడు, చిన్నకొండేపూడి, సింగవరం నాగరత్నంకాలనీ,సింగవరం,బొబ్బిలంక సుబ్బారావుపేటలలో వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోటికేశవరం,బూరుగుపూడి,నరసాపురం, దోసకాయలపల్లి, మునగాలలో ట్యాంకులు,పైపులైన్ ల నిర్మాణానికి టెండర్స్ ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ చేపడతామన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో రూ.12కోట్లతో, 19పనులను ప్రారంభించామని, అందులో 7.89 కోట్లతో పనులు పాక్షికంగా పూర్తి చేశారని, మిగిలిన 5.58కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో ఆగిపోయిన విషయం ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్ళి టెండర్ ప్రక్రియకి అనుమతులు తీసుకుంటా మన్నారు. రూ1.28కోట్లతో కోటి కేశవరం,బూరుగుపూడి, నరసాపురం, దోసకాయపల్లి, మునగాల లో జేజీఎం కింద మంజూరైన పనులకు టెండర్ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. చెక్కధారబంధంలో 16.50 లక్షలతో డిఎంఎఫ్ కింద మంజూరైన బోర్వెల్ కు టెండర్స్ పిలిచారని,టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ పాశాలమ్మ అమ్మవారి దేవాలయ పునః ఆగమన ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గుళ్ళ గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పాశాలమ్మ అమ్మవారి ఆలయం పునః అగమన ప్రతిష్ట మహెూత్సవం కార్యక్రమంలో బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటి కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠా మహెూత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ పాశాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో భోగభాగ్యాలతో ఉండాలని అమ్మవారి కృప ప్రతీ ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మలేరియా నియంత్రణకు ముందస్తు ప్రణాళిక

**పాడేరు, విశ్వంవాయిస్ న్యూస్ :** మన్యంలో మలేరియా నియంత్రణకు ప్రణాళిక బద్దంగా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద మలేరియా విభాగం, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్డిఏ, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జల వనరులు, గిరిజన సంక్షేమ శాఖ, మత్స్యశాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని దోమలను అరికట్టేందుకు పిచికారి పనులు సకాలంలో నిర్వర్తించాలని సూచించారు. గత ఏడాది చేపట్టిన మలేరియా నివారణ చర్యలపై ఆరా తీసారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ మరణాలు జరగకూడదన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి పెట్టి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా వ్యాప్తిని అరికట్టడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మూడు ఐటిడిఏల పరిధిలో యాంటీలార్వా ఆపరేషన్, దోమల నివారణ మందులు పిచికారీ, దోమ తెరల వినియోగం పై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి ఆ దిశగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియాను నియంత్రించే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. దోమల మందు పిచికారీ పై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతీ ఇంటింటి లోపల బయట దోమల మందు పిచికారీ పనులు చేపట్టాలన్నారు. జ్వరాలున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. ఐటిడిఏ పిఓ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మలేరియా రిజిష్టర్లను తనిఖీ చేయాలన్నారు.


విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

మన్యం జిల్లా ఎడిషన్

గురువారం, 3-4-2025
www.viswamvoice.com






కూనవరం మండలంలో ఈ నెల 4వతేదిన 4 గ్రామాలలో

## పోలవరం ఆర్ అండ్ ఆర్ గ్రామ సభలు

### అపూర్వ భారత్ ఐఏఎస్ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చింతూరు



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో ఈనెల 4 ది న ఉదయం 11 గంటలకు కూనవరం మండలంలోని పోలవరం మొదటి ఫేజ్ 1 లో ముంపు కు గురి అవుతున్న 32 గ్రామాలలో భాగంగా కూనవరం మండలంలోని శబరి కొత్త గూడెం, పేదర్కూరు,టేకు బాక, మరియు టేకులబోరు గ్రామ లలో భూ సేకరణ ఆర్ & ఆర్ గ్రామ సభలు నిర్వాసితుల యొక్క గ్రామాలలో నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో ఆర్ & ఆర్ ప్యాకేజీ వివరాలు మరియు భూమికి భూమి , ఆర్ %డ% ఆర్ కాలనీ లకు భూమి వంటి అంశాలపై గ్రామ సభ నిర్వహించడం జరుగుతుంది. అదే విధంగా ఈ గ్రామ సభలో ఆర్ & ఆర్ ప్యాకేజీ కి అర్హుల మరియు అనర్హుల వివరాలు వెల్లడించడం జరుగుతుంది అని చెప్పినారు. సదరు ఆర్ & ఆర్ ప్యాకేజీ సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో వెంటనే అదే గ్రామ సభలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి ఆర్జీ సమర్పించవచ్చు. కావున గ్రామస్తులు అందరూ ఈ గ్రామ సభలో పాల్గొని గ్రామ సభలని విజయవంతం చేయవలసిన ప్రాజెక్ట్ అధికారి వారు కోరిన్నారు. తదుపరి వచ్చే వారం మిగిలిన ముంపుకు గురి అవుతున్న గ్రామాలలో కూడా గ్రామసభలు నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాము అని పేర్కొన్నారు.

ఐటీడీఏ పీఓ దృష్టికి

## గుండాల పంచాయతీ సమస్యలు

### నూతన రహదారి మంజూరు చేయాలని వినతి
### వినతిపత్రం అందజేసిన సిపిఎం, గిరిజన సంఘం నాయకులు





**ఎటపాక, విశ్వంవాయిస్ న్యూస్ :** మండలంలోని గుండాల గ్రామపంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై ఎటపాక సిపియం పార్టీ నాయకులు బుధవారం చింతూరు ఐటీడీఏలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లో ఐటిడిఏ పీఓ అపూర్వ భరత్ కు వినతిపత్రం అందజేశారు. పురుషోత్తపట్నం సెయింట్ ఆన్స్ పాఠశాల నుండి కెవన్ పురం వరకు రహదారి పూర్తిగా దెబ్బతినడంతో తారురోడ్డు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు తోట శ్రీనివాసరావు , నూతలపాటి సుధాకర్ , గిరిజన సంఘం నాయకులు ఇర్పా అజయ్ పిఓ కు వినతిపత్రం అందజేశారు. రహదారి గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిఓ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఐటిడిఎ నుండి గ్రాంట్ మంజూరు చేసి త్వరితగతిన నూతన రహదారుల పనులు ప్రారంభించాలని కోరారు. గుండాల ఇసుక ర్యాంపు పిసా చట్టానికి విరుద్ధంగా నడుస్తుందని , గుండాల గ్రామ అభివృద్ధికి ఇసుక సొసైటీ నిర్వాహకులు , లీజ్ దారులు సహకరించటం లేదన్నారు. మండలంలో కొందరు గిరిజన చట్టాలకు , వోల్టా చట్టానికి విరుద్ధంగా అక్రమంగా ఇసుక , మట్టి తవ్వకాలు జరుపుతున్నారని పిఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గుండాల పిసా సెక్రటరీ ఇర్ప అజయ్, గోళ్ళగట్ట పీసా సెక్రటరీ పెనుబల్లి భీష్మారావు, గుండాల వార్డ్ మెంబర్ నూతలపాటి సుధాకర్, గోళ్ళగట్ట వార్డ్ మెంబర్ పి చలపతి, సీఐటీయూ నాయకులు తోట శ్రీను, సీపీఎం పార్టీ సభ్యులు బి ఏడుకొండలు గోళ్ళగట్ట గ్రామస్తులు వెంకటేష్, శివ, వెంకట్రావు, బాలు, పవన్, గణేష్ , దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుకూరు గ్రామంలో పంచాయతీ

## నిధులతో పైప్ లైన్ నిర్మాణం

### సర్పంచ్ సున్నం అభిరామ్



**కూనవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం చిన్నర్కూర్ పంచాయతీ పంద్రాజుపల్లి (మధ్య గుంపులో ) కట్టం.వీరయ్య టీచర్ ఇంటి ముందున్న వాటర్ ట్యాంక్ నుండి గ్రామపంచాయతీ నిధులతో పైపులైను నిర్మాణం చేయిస్తున్న స్థానిక సర్పంచ్ సున్నం. అభిరామ్ గారు, ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పాయం.రంగమ్మ గారు,పంచాయతీ సెక్రెటరీ శివమణికంఠ గారు,వార్డు మెంబర్లు మడివి.కనకదుర్గ, బొడ్డు.కనకదుర్గ, కట్టం వీరయ్య టీచర్, పొట్ల.వెంకయ్య తాటి.రాంబాబు, మడివి. కామయ్య,బొడ్డు.అంజన్ రావు, పొట్ల. లక్ష్మణరావు,కాంట్రాక్టర్ సురేష్ గారు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

**అనంతగిరి, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని హెూటల్స్, కిరాణా దుకాణాలు, ప్రభుత్వ. ప్రైవేటు రిసార్ట్స్, ఇతర చోట్ల పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని ఎంపిపిఒ ఎవివి.కుమార్, ఇన్ఛార్జి తహశీల్దార్ ఎస్.మాణిక్యం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యాపారసంస్థలు, ప్రభుత్వ. ప్రైవేటు రిసార్ట్సను ఆకస్మికంగా సందర్శించి, ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్వర్వులు, ఆదేశాలను బేఖాతరు చేసి ఎవరైనా ప్లాస్టిక్‌ను వినియోగిస్తే తొలితప్పుగా రూ.2,500 జరిమానా విధిస్తామని, అప్పటికీ తీరుమారకపోతే, ఆయా వ్యాపారసంస్థలు, హెూటల్స్ అనుమతులు రద్దుతోపాటు జప్తు చేస్తామని, నిబంధనల మేరకు కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా అమలులో ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఆర్ఐలు పి శంకరరావు, జగ్గయ్యమ్మ, సెక్రటరీ సిఎస్ దేవా, విఆర్ఒ దేముడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం చిన్నోడు టూ కోర్టు

## చిత్రంలో కథానాయకుడు

### కోర్టు సినిమా హీరో రోషన్ రోషన్ - డ్రైవర్ మస్తాన్ గారి మనవడు




**కూనవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా,కూనవరం మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన గౌరవనీయులు డ్రైవర్ మస్తాన్ అంటే తెలియని వారు ఉండరు. ఆయన మనవడు రోషన్ కోర్టు చిత్రంలో హీరోగా నటించి బ్లాక్ బస్టర్ విజయం ను సాధించాడు.రోషన్, గౌరవనీయులు మస్తాన్ కుమారుడు అయినా రషీద్ రెండవ కుమారుడు. రోషన్ చిన్నతనం నుంచే ఆటపాటల్లోనూ డాన్స్ ప్రోగ్రాం లోనూ పాల్గొంటూ చాలా చురుగ్గా ఉండేవాడు. రోషన్ తండ్రి రషీద్ కేటీపీఎస్ లో ఉద్యోగరీత్యా పాల్వంచలో కుటుంబం తో నివాసం ఉండేవారు. ఆ టైంలో ఆట జూనియర్స్ లో రోషన్ కి ఛాన్స్ లభించింది.ఆ తర్వాత నుంచి హైదరాబాదులో అనేక డాన్స్ ప్రోగ్రాంల లో , ఈవెంట్ కార్యక్రమాల్లో అవకాశం లభించింది. రోషన్ చిన్నతనం నుంచి చదువు లోను ముందుండేవాడు.డాన్స్ చాలా బాగా చేసేవాడు, నటన లో కూడా చాలా ప్రావీణ్యత చూపించేవాడు.అది గమనించిన రోషన్ తండ్రి రషీద్, కుమారుడు భవిష్యత్తు గురించి తన ఉద్యోగాన్ని కూడా వదులుకొని హైదరాబాద్ నగరంకు వెళ్లి అక్కడే నివాసం ఉన్నారు. అప్పటినుంచి రోషన్ కి చాలా సినిమాల్లో , చిన్నప్పటి హీరో పాత్రలు లభించేవి. అలాగా అనేక సినిమాల్లో నటించి, తనకున్న నటనలోని ప్రావీణ్యత తో అందరిని మెప్పించేవాడు. విరూపాక్ష చిత్రంలో ముఖ్యమైన పాత్రలో నటించి, అందరి చూపు తన వైపు తిప్పుకున్నాడు. ఆ తర్వాత ప్రభాస్ చిత్రం సలార్ లో ముఖ్యమైన పాత్రలో చాలా బాగా నటించాడు. ఇంకా ఎన్నో చిత్రాలలో తన నటన ప్రావిణ్యతని చూపించాడు. ఎట్టకేలకు కోర్టు సినిమాలో హీరో పాత్రాన్ని కైవసం చేసుకుని చాలా బాగా నటించి, తన టాలెంట్ నిరూపించుకున్నాడు. కోర్టు సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో రోషన్ బాగా ప్రాచుర్యం చెందాడు. ఇలా కూనవరం చిన్నోడు చిత్ర పరిశ్రమలో చిన్న చిన్నగా ఎదుగుతూ,ఈరోజు హీరో స్థాయికి ఎదగడం ఎంతో గర్వంగా ఉందని కూనవరం ప్రజలు కొనియాడారు. మంగళవారం రోజున రోషన్ తన స్వగ్రామం కూనవరం కు కుటుంబంతో వచ్చారు.రోషన్ కోర్టు సినిమా విజయం సాధించినందుకు, రోషన్ తండ్రి రషీద్ చిన్ననాటి మిత్రులుఅయినా మావూరి శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్,తాళ్లూరి శ్రీనివాస్, తాళ్లూరి రామారావు, యాలం నాగేశ్వరావు, కొండ ఈశ్వర్లు, అలాగే చిత్ర పరిశ్రమ మీద ఎంతో అభిమానం ఉన్న, రోషన్ శ్రేయోభిలాషి మారపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో రోషన్ మాట్లాడుతూ నేను మీ కూనవరం కుర్రవాడిని, గౌరవనీయులు డ్రైవర్ మస్తాన్ మనవడు ను అని గర్వంగా చెప్పాడు. కోర్ట్ సినిమాలో పలు డైలాగులు చెప్పి గ్రామస్తులందరినీ అలరించాడు. యుక్త వయసులో ఉన్న యువతీ,యువకులు వారి భవిష్యత్తు పైన దృష్టి పెట్టాలని, సమాజంలో ఉన్న స్థాయికి ఎదగాలని అని కోరుకుంటున్నాను అని తెలిపాడు. ఇలాంటి మంచి సినిమాలు ఇంకా ఎన్నో చేస్తానని, మీ అందరి అభిమానం ఇలాగే ఉండాలని తెలిపారు . రోషన్ తండ్రి రషీద్ మాట్లాడుతూ నా కుమారుడికి మీ దీవెనలు ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోషన్ కుటుంబం, అభిమానులు, కూనవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ విజయోత్సవ ఆటోయాత్ర ప్రారంభం

### ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ చేతుల మీదుగా నెల్లిపాక టూ పిఠాపురం వరకు సాగనున్న ఆటోయాత్ర
### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం




**ఎటపాక, విశ్వంవాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ విజయోత్సవ యాత్రను బుధవారం పార్టీ శ్రేణుల సమక్షంలో జండా ఆవిష్కరించి ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. మార్చి 14వ తేదీన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పిఠాపురంలో ఘనంగా జరుపుకున్న సందర్భంగా సభ విజయవంతమైన నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ యాత్ర నెల్లిపాక నుంచి ప్రారంభమై చింతూరు మీదుగా మారేడుమిల్లి, రంపచోడవరం, గోకవరం, జగ్గంపేట , పెద్దాపురం మీదుగా పిఠాపురం చేరుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ యాత్ర రెండు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఈ యాత్రలో పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి




కార్యక్రమాలను ప్రతి గ్రామంలో తెలియజేస్తూ, ప్రజలందరూ జనసేన పార్టీకి అండగా ఉండాలని ఈ యాత్రను కొనసాగించడం జరుగుతుందని జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్



తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటపాక ఉపాధ్యక్షులు మందా సుబ్రహ్మణ్యం ఒక మంచి కమిట్మెంట్ ఉన్నటువంటి కార్యకర్త అని, జనసేన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తి అని కొనియాడారు. అటువంటి కార్యకర్తలు ఈ ఆటో యాత్ర చేపట్టడం చాలా సంతోషకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోడేటి నాగరాజు, ములకలపల్లి రవీంద్రనాథ్, గొడ్ల శ్రీనివాసరావు, మహేష్, జనసైనికులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## అలుగువాగు ప్రాజెక్టు కాలువల మరమ్మతులు చేపట్టాలి

### రంపచోడవరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత.. టిడిపి యువ నాయకులు దానే రాజు




**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణవరం పంచాయతీ అచ్యుతాపురం గ్రామంలో ఉన్న అలుగువాగు ప్రాజెక్టు కుడి కాలువ, ఎడమ కాలువల పూడిక తీయించడం, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బుధవారం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దానే రాజు రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, విజయభాస్కర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గర్భకుంట గ్రామానికి సింగిల్ ఫేస్ కరెంటు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని, కృష్ణవరం, భూపతిరావుపేట మధ్యలో ఉన్న చప్ట (కలవర్టు) ఎత్తు పెంచి నిర్మించాలని, కృష్ణవరం గ్రామంలో నూతన అంగనవాడి కేంద్రాన్ని మంజూరు చేయాలని, కృష్ణవరం పంచాయతీలోని గ్రామాలకు సిమెంటు రోడ్డు, తారు రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందించినట్లు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దానే రాజు మీడియాకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలువురు తెలుగు తమ్ముళ్లు ఉన్నారు.

## పాడేరులో విభిన్న వాతావరణం

### మంచులో వస్తున్న బస్




**పాడేరు,** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కురుస్తుండగా మధ్యాహ్నం వేళల్లో ఎండ ఠారెత్తిస్తోంది. ఉదయం మంచు దుప్పటి కప్పేస్తోంది. ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఓ మోస్తారుగా చలి కూడా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు, సామాన్యులు సైతం తెల్లవారుజామున వాకింగ్ చేయలేని పరిస్థితి. ఉదయం 9 గంటల తర్వాత మాత్రం సీన్ మారుతోంది. మెల్లగా పొగ మంచు తొలగిపోగా.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.



# నల్ల కలువ అవతార్‌లో త్రిప్తి

'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి డిమ్రి గత ఏడాది బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈమె నటించిన భూల్ భులయ్యా 3 సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే యానిమల్ సినిమాలో ఓవర్ డోస్ శృంగార సన్నివేశాల్లో నటించి గుర్తింపు దక్కించుకోవడం వల్ల అన్ని సినిమాల్లోనూ అలాంటి పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయట. దాంతో త్రిప్తి సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇటీవల ఒక స్టార్ హీరో సినిమాలో త్రిప్తి హీరోయిన్‌గా ఎంపిక అయి, ఆమెకు ఉన్న ఇమేజ్ కారణంగా తప్పించారనే వార్తలు వస్తున్నాయి. త్రిప్తి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ధడక్ 2 సినిమాతో పాటు ఇంకా టైటిల్ ఖరారు కానీ మరో సినిమాలోనూ త్రిప్తి ప్రస్తుతం నటిస్తోంది. ఆ రెండు సినిమాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సందడికి సిద్ధం అవుతున్న త్రిప్తి తనపై ఉన్న ఇమేజ్‌ను తొలగించుకునే ప్రయత్నాలు చేస్తుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు వస్తే తప్పకుండా మెప్పిస్తాను అనే నమ్మకంతో ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. తాజాగా మరోసారి త్రిప్తి బ్లాక్ డ్రెస్‌లో సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే స్టైలిష్ లుక్‌లో త్రిప్తి ఆకట్టుకుంది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందంగా ఉన్న త్రిప్తిని వెండి తెరపై శృంగార తార పాత్రలో చూసేందుకు ఎక్కువ శాతం మంది ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ సైతం అదే విధంగా ఆమెను చూపించాలని భావిస్తున్నారు. కానీ త్రిప్తి మాత్రం నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసేందుకు ఎదురు చూస్తుంది.

# జైలర్ -2 లో బాలయ్య వర్సెస్ సూర్య!





సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో -జైలర్ -2- పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ జరుగుతోంది. అయితే ఇందులో ఎంత మంది స్టార్ హీరోలు నటిస్తున్నారు? అన్న దానిపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు. తొలి భాగంలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్ లాంటి స్టార్లు గెస్ట్ అప్పియిన్స్ తో అదొరగొట్టడంతో? జైలర్ 2- లో అంతకు మించే ఉంటుంది తప్ప తగ్గదు అనే ప్రచారం తొలి నుంచి జరుగుతూనే ఉంది. టాలీవుడ్ నుంచి నటసింహా బాలకృష్ణ పవర్ ఫుల్ పాత్రలో రంగంలోకి దిగుతున్నారని ఇప్పటికే ప్రచారంలో ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్ కి ఏ మాత్రం తగ్గకుండా తెరపై కనిపించినంత సేపు విధ్వంసంలాగే పాత్ర నడుస్తుందని ప్రచారం జరిగింది. కంటున్యూటీగా మోహన్ లాల్, శివన్న పాత్రలు యధావిధిగా ఉంటాయని వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన నటుడి పేరు తెరపైకి వస్తోంది. కోలీవుడ్ విలక్షణ నటుడు సూర్య కూడా ఇందులో ఓ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. నెల్సన్ సూర్యతో చర్చలు జరుపుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక సమాచారం వెలువడుతుందని వినిపిస్తుంది. నిజంగా సూర్య కూడా ఎంటర్ అయితే ప్రాజెక్ట్ నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. బాలయ్య ను పాజిటివ్ రోల్ లో లాంచ్ చేసి సూర్య కు పవర్ ఫుల్ నెగిటివ్ రోల్ అప్పగించి..వాళ్లిద్దరి మధ్యా మాటల యుద్ధం...భారీ యాక్షన్ సీన్ ప్లాన్ చేస్తే మామూలుగా ఉండదు. సూపర్ స్టార్ ఇమేజ్ సైతం కొట్టుకుపోయే పెర్ఫార్మెన్స్ తో అదర గొడతారు. ఆ సీన్స్ కు సూపర్ స్టార్ ఇమేజ్ టచ్ అప్ ఇస్తే నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. బాలయ్య కు కోలీవుడ్ లో కూడా మాస్ ఫీల్ దక్కుతుంది. మరి నెల్సన్ ఎలాంటి వ్యూహంతో ఉన్నాడో చూడాలి.



# రష్మికపై కొత్త విమర్శలు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాలను సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ మూడు సినిమాలతో దాదాపుగా రూ.3300 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకుంది. ఒక హీరోయిన్ ఈ స్థాయిలో వసూళ్లను సొంతం చేసుకున్న సినిమాలను కేవలం రెండేళ్ల గ్యాప్‌లో చేయడం అనేది రికార్డ్‌గా చెప్పుకోవచ్చు. ఈ మూడు సినిమాల తర్వాత వచ్చిన సల్మాన్ ఖాన్ 'సికిందర్' సినిమాకు మిశ్రమ స్పందన దక్కింది. ఓపెనింగ్ కలెక్షన్స్ నిరాశ పరచినా లాంగ్ రన్‌లో రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు రాబట్టే అవకాశాలు ఉన్నాయి అనే టాక్ వినిపిస్తోంది. రష్మిక గత చిత్రాలతో పోల్చితే సికిందర్ నిరాశ మిగిల్చినట్లే. ఆమె చేసే వ్యాఖ్యల కారణంగా వివాదంలో ఉంటే, కొన్నిసార్లు ఆమెకు తెలియకుండానే వివాదంలో చిక్కుకుంటుంది. ఆమె అభిమానులు గొప్పగా చెప్పుకుంటున్న యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలో హీరోయిన్ పాత్ర గురించి ట్రోల్స్ వస్తున్నాయి. కొందరు సినీ విశ్లేషకులు రష్మిక ఆయా సినిమాల్లో చేసిన పాత్రల గురించి కాస్త ఘాటుగానే కామెంట్స్ చేస్తున్నారు. ఆ మూడు సినిమాల్లోనూ హీరోల పాత్రలను హైలైట్ చేయడం కోసం రష్మిక పాత్రను వినియోగించారు.

# దంగల్ బ్యూటీ స్టైలిష్ కవర్ ఫోజ్

బాల నటిగా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన ఫాతిమా సనా షేక్ హీరోయిన్‌గానూ ఆకట్టుకుంది. సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన దంగల్ సినిమాలో ఆయన కూతురుగా నటించడం ద్వారా ఒక్కసారిగా బాలీవుడ్‌లో గుర్తింపు దక్కించుకున్న ఫాతిమా సనా షేక్ బిజీ హీరోయిన్‌గా మారింది. దంగల్ సినిమాలో ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలో నటించిన ఫాతిమా ఆ వెంటనే థగ్స్ ఆఫ్ హిందుస్థాన్ సినిమాలో ఆమీర్ ఖాన్‌కి జోడీగా నటించిన విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో చిన్న హీరోల సినిమాలతో పాటు, స్టార్ హీరోల సినిమాల్లోనూ కనిపిస్తున్న ఈ అమ్మడు బాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్స్ జాబితాలో చేరి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. గత ఏడాది కొన్ని కారణాల వల్ల ఈమె నటించిన సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాలేదు. కానీ ఈ ఏడాది ఈమె నటించిన సినిమాలు మూడు నుంచి ఐదు సినిమాలు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. బాలీవుడ్‌తో పాటు అవకాశాలు వస్తే, పాత్రకు ప్రాముఖ్యత ఉంటే కచ్చితంగా సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు తనకు ఎలాంటి ఇబ్బంది లేదని ఫాతిమా సనా షేక్ చెప్పుకొచ్చింది. రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేసే ఫాతిమా మరోసారి కవర్ ఫోటో స్టిల్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 3.3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఫాతిమా ఏ ఫోటోలు షేర్ చేసినా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె సిటీ షోస్టాపర్స్ బ్రాండ్ ప్రమోషన్స్‌లో భాగంగా అందమైన స్టిల్స్‌కు ఫోజ్ ఇచ్చింది. కవర్ ఫోటో మాదిరిగా ఫాతిమా స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈమె ప్రమోషన్‌తో %ు% సిటీ షోస్టాపర్స్ బ్రాండ్ వాల్యూ అమాంతం పెరుగుతుంది అంటూ కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చాలా ఫోటోలను షేర్ చేసిన సిటీ షోస్టాపర్స్ పోస్ట్‌కి మంచి స్పందన దక్కింది. ఫాతిమా సనా షేక్ అందమైన ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు, ఆ బ్రాండ్ గురించి కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగేలా చేసింది. తన అందంతో ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ ఉండే ఫాతిమా ఆ మధ్య ఒక వివాదంతో వార్తల్లో నిలిచింది. సీనియర్ హీరోతో ఈమె ప్రేమ వ్యవహారం అంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఆ సమయంలో ఫాతిమా మాట్లాడుతూ తాను పెళ్లి చేసుకోను అంటూ తేల్చి చెప్పింది. అంతే కాకుండా తనకు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని, తాను సింగిల్‌గానే చాలా సంతోషంగా ఉంటానని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. అంతే కాకుండా తన పద్ధతికి, తన లైఫ్ స్టైల్, వర్కింగ్ స్టైల్‌కి పెళ్లి అనేది అడ్డు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. దంగల్ సినిమా తర్వాత బిజీ అయిన ఫాతిమా ఈ ఏడాదిలో మరిన్ని సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంటుందేమో చూడాలి.








VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com